UNIVERSAL LIBRARY
OU_204968
UNIVERSAL LIBRARY

# నవనీతము

౧

నోరి నరసింహశాస్త్రి

సంపాదకుడు

నవ్య సాహిత్య పరిషత్తు

గుంటూరు

# విషయానుక్రమణిక


| | | | |
|---|---|---|---|
| పరిచయము | | | |
| తెనుగుతోట | - | రాయప్రోలు సుబ్బారావు | ౧ |
| దివ్యలోచనములు | - | తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి | ౮ |
| అన్వేషణము | - | దేవులపల్లి కృష్ణశాస్త్రి | ౧౪ |
| నిరీక్షణము | - | వేదుల సత్యనారాయణశాస్త్రి | ౨౧ |
| బృందావనము | - | చామర్తి రాజశేఖరరావు | ౨౮ |
| విప్రలబ్ధవిపంచి | - | పింగళి లక్ష్మీకాంతం<br>కాటూరి వెంకటేశ్వరరావు | ౩౭ |
| కనకాభిషేకము | - | కొడాలి సుబ్బారావు | ౩౫ |
| భిక్షువు | - | కొడవటిగంటి వెంకటసుబ్బయ్య | ౪౨ |
| నవనీతము | - | విశ్వనాథ సత్యనారాయణ | ౪౪ |

# ప రి చ య ము

౧

అయితే నవకవిత్వ మేమిటి? కవిత్వ మేమిటో దాని స్వరూప మేమిటో నిర్ణయించలేక పెద్దలే బాధపడుతూ ఉంటే, అందుకు తోడు ఈ 'నవ' విశేషణము కూడా ఎందుకు? ఈ కవిత్వములో కొత్త ఏమిటి? భాష కొత్తా? భావము కొత్తా? ఛందస్సు కొత్తా? రీతిలోనా, అలంకారములోనా, రసములోనా, - ఎందులో ఈ నవ్యత? లేక వ్యాకరణమర్యాదలు ఉల్లంఘించడములో కొత్తా? అర్థము లేకుండా వ్రాయడములోనా? కాక పెద్దలను ధిక్కరించడములోనా? ఎందులో ఉన్నది నవ్యత నవకవులలో?— ఈ విధముగా పెద్దలే అడుగుతున్నారు. అన్నిటిలో అని ప్రత్యుత్తర మీయవచ్చును. అప్పుడు ఈ ప్రశ్నలు వేసే పెద్దలు నవకవులకు చివరకు వ్యాకరణోల్లంఘనములో కూడా కొత్తదన మున్నదని ఒప్పుకోరు. అపాణినీయాలే కాక అనింద్యగ్రామ్యాలు కూడా నన్నయాదులే ప్రయోగించి దారి చూపినారు; అందులో మాత్రము వీరి కొత్త ఏమిటి? అని పెద్దలు నవకవులకు నవ్యత లేదని నిరూపించగలరు. అట్టివారిది భౌతిక శాస్త్రపరీక్ష వంటిది. లోకములో ఉన్న వస్తువు లన్నీ పంచభూత

ముల సంయోగాలవల్ల కలిగే వివిధవికారాలే కాబట్టి, అన్నీ ఒకటే అని ఋజువుచేసే దివ్యజ్ఞాన మూర్తులే పెద్దలు.

తెలుగు వాఙ్మయమంతా వివరించి చూస్తే అక్షరాల తర గతిలో చదువుకున్న ౫౬ అక్షరాల కలయికవల్ల చేసే గార డీయే కాని మరేమీ కానట్లు తోస్తుంది అట్టివారికి. అటు వంటి బ్రహ్మజ్ఞానులను ఉద్దేశించి చెప్పేది కాదీ నవకవిత్వము అనేమాట. ఉపాధిభేదాలు అంగీకరించే సామాన్యులైన ప్రాకృత మానవులకు చెప్పే మాట ఇది!

ప్రకృతి అంతటిలోనూ జననమూ, వృద్ధీ, జీర్ణావస్థా, ఒకదాని తర్వాత ఒకటి వచ్చి, జీర్ణస్థితిలోనుంచే పునర్జననము కనపడు తుంది. కాలపురుషుడు ప్రతిసంవత్సరమూ శిశిరములో జీర్ణించి, వసంతములో పునర్జన్మ పొందుతున్నాడు. చెట్లు చిగిర్చి నెమ్మదిగా వృద్ధిపొంది చివరకు శిశిరములో ఆకులు రాలిపోయి, మళ్ళా ఆ మోళ్లనే వసంతములో చిగిరిస్తున్నవి. మహానదులు వర్షముతో వృద్ధియై గ్రీష్మముతో క్షీణించి మరల వర్షముతో పునఃపుష్టి పొందుతున్నవి. కవిత్వము మహా ప్రవాహమైతే, దానికీ వర్షమూ గ్రీష్మమూ మరల వర్ష ఋతువూ ఉన్నవి. కవిత ఒక రసాలశాఖ అంటే, దానికీ వసం తమూ శిశిరమూ మళ్ళీ వసంతమూ ఉన్నవి. ప్రవాహాము లకు వర్షాగమముతో కొత్తనీరు వస్తుంది. తరుగుల్మాదులు వసంతాగమముతో నవనవలాడుతూ ఉంటవి. ఆ విధముగానే

ఇది నవకవిత్వము. ఇందులో పూర్వకవిత్వ ప్రకృతి మారి పోయిన దని కాదు. మునుపు లేనిది ఇప్పుడు కొత్తగా పుట్టిన దని కాదు. స్త్రీలలో లావణ్యమువలె, పసిపాపల పాల మిసిమి వలె, యువకులలో ఉత్సాహమువలె, యోగులలో శాంతివలె, కావ్యములలో రసమువలె, ఇదమిత్థ మని స్పష్టముగా వర్ణించ డానికి సాధ్యముకాక ఇటువంటి దని కొంత సూచించడానికి సాధ్యమై అనుభవైకవేద్యమైన ఒకానొక విశిష్టధర్మ మున్నది నవకవిత్వములో.

నవకవిత్వమును విశేషముగా స్తుతిచేసేవారూ లోకములో ఉన్నారు. దానిని చూచి అపహసించి నిరసించి విశేషముగా నిందించేవారూ ఉన్నారు - యువతిని చూచి వృద్ధనారి అసహ్యించుకొన్నట్లు. కాని నవకవిత్వమును భూషించినా దూషించినా, ఉభయపక్షాలవారూ దాని నవ్యత అంగీ కరించినవారే అవుతున్నారు. ఒకరికి ఆ నవ్యత సమ్మతము; ఇంకొకరి కది అసమ్మతము. దానినిబట్టి అది అనుభవైకవేద్య మని అన్నమాట సత్య మని ఋజు వవుతుంది.

౨

అయితే, నవకవిత్వ మంటే మును పెన్నడూ లేని కొత్తదే ఈ కవిత్వము అని వాదించేవారు మనదేశములోనూ ఇతర దేశము లలోనూ కూడా ఇప్పుడు లేక పోలేదు. ఆటవికమానవుడు మారిపోయి నాగరిక మానవుడు పూర్వము ఎట్లా వచ్చినాడో,

ఆ విధముగానే ఇప్పుడు పూర్వనాగరికమానవుడు పూర్తిగా మారిపోయి ఆధునికమానవుడైనాడని వారి ఊహ. ఈ విధముగా మానవప్రకృతే మార్పుచెందినది కాబట్టి, దానితో పాటు మానవకవిత్వముకూడా పూర్తిగా మారవలెననీ, మారి తీరుతుందనీ వారి మతము. పూర్వమానవులెరగని మారణసాధనాలు కనిపెట్టగలిగిన ఆధునిక మానవుని అహంభావము వల్ల జనించిన దీ వాదము. మొదటి ఐరోపా మహాసంగ్రామానికి కొద్దిగాముందు ఈ వాదము ప్రారంభించి యుద్ధానంతరము లోకమంతటా వ్యాపించినది. అది మృత్యుముఖముగా మహామాయా ప్రేరణవల్ల పరుగెత్తుతున్నవారి వాదము. అగ్నిశిఖ మింగబోతున్న శలభముల అహంభావ మది. వారి వాదము అంగీకరిస్తే, ఇప్పుడు మనము మహాకవులు అనుకునే కాళిదాసాదులు కవులు కారు; వారి కవిత్వము కలిగించిన ఆనందము మూఢమాత్రయోగ్యమైనది. ఇంత ఎందుకు! ఇంతవరకూ లోకములో పుట్టిన కవిత్వము కవిత్వము కాదు. నవ్యకవిత్వము పుట్టుతున్నది; పుట్టబోతున్నది; పుట్టుతూంది—అని వారి వాదము.

ఈ అహంభావపూరితులు ఉద్దేశించే అర్థముతో నవ్యకవిత్వమనే పదము ఇందులో వ్యవహరించలేదు. అహంభావ కవుల వాదన ఏమైనా ఇంతవరకూ వారు చేసిన రచనలనుబట్టి పరీక్షించగా అది పూర్వము ఎన్నడూ ఎవరూ ఎరగని క్రొత్తది కాకపోవడమేకాక, మన సాహిత్యవేత్తలు అధమవిధమైన

కవిత్వ మని నిరసించిన చిత్ర కవిత్వముగా గణించదగినదిగా కనబడుతున్నది. వారి వాదానికి అనుగుణమైన రచనలుచేసి చూపే వరకూ, వారి ప్రయత్నము ఆకాశసౌధనిర్మాణము గా తలంచక తప్పదు.

౩

కొంత కాలమునుంచీ భరతఖండము అంతటా ఒక నవశక్తి ఆవేశించి తాండవ మాడుతున్నది. బహుకాలము పారతంత్ర్యము అనుభవించి దాస్యవిమోచనకై అమృతాహరణమునకు సిద్ధపడిన గరుడుని రెక్కల ఆస్ఫాలనమే కావచ్చునది! కాక ఆధునికుల ప్రచార సాధనాలవల్ల దేశదేశాల స్వరూపమంతా ఒక్కసారిగా మనకు తెలిసుకోగలిగినందువల్ల సూర్యోదయముతో వికసించే పద్మమునువలె మన బుద్ధికి కలిగిన వికాసమే దీనికి కారణమేమో! వాయువు విశేషము మందగించిన చోటనే మరుక్షణములో తుపాను రేగుతుంది. ఆ విధముగానే మన దేశములో కొంతకాలమునుంచి ఒకానొక నూతనోజ్జీవము కలిగింది. తెలుగు కవిత్వములో ఈ నూతన చిహ్నాలు అంతకు మునుపే కనబడుతూ ఉన్నప్పటికీ, అవి స్పష్టముగా కార్యరూపము పొందినది ౧౯౧౩ సం॥లో. శ్రీ రాయప్రోలు సుబ్బారావు తృణకంకణము ప్రచురణముతో ప్రమాదీచ సంవత్సర శ్రావణ పౌర్ణిమ స్థిరవాసరమైనట్లు ప్రకాశకులు అందులో ఉల్లేఖించినారు. కవి అన్నాడు:

"శాశ్వత నవ్యస్ఫురణల
నశ్వర లావణ్యమై యొసయు గావ్యకళా
విశ్వమునన్ రసమయమధు
వైశ్వర్యము లేలు కవిత కంజలి నిత్తున్"

"శశి వికసించిన శ్రావణ
నిశీథమున, గానబడిన నీరద సుతకన్
ప్రశమితమతినై యీ ప
ద్యశుభాంజలి నొసగితి ప్రణయార్పణ మనుచున్"

ప్రకాశికలు పీఠికలో "ఇప్పటి యాంధ్ర వాఙ్మయమున బురాతన శక్తి రచన తగ్గి నూతన వికాసాంకురములు పొడగట్టుచుండుట కెంతయు సంతస" మందినారు. నవీన భావములు నూతనాదర్శములు జీవకళలు లోకపరిణామ హేతువు లని చాటినారు. లాక్షణికుల సర్వాధికార ధూర్వహత్వమును నిరసించి కవుల స్వాతంత్ర్యము రక్షించినారు. తృణకంకణము, కష్టకమల, స్నేహలతాదేవి, తెనుగుతోట, స్వప్నకుమారము— వరుసగా ఐదు కావ్యములు ౧౯౧౩, ౧౯౧౪ సంవత్సరములలో అభినవకవిమండలి తరఫున ప్రచురించినారు. అందులో 'తెనుగుతోట'లో ఆ రోజులలో తెలుగు కవిత్వములో విజృంభిస్తూ ఉన్న నవజీవనము రమణీయముగా ప్రతిబింబించి కానవస్తున్నది. 'లేఖినీశుభావాహన'లో కవి

"లలిత సారస్వత నికుంజ వలయ మెల్ల
నవనవానంద భావ సుందర లతాంత
ములను నననలాడు నో ముద్దు కలమ! "

అని సంబోధించినారు. నవకవుల రచనల సంపుటి ఏదైనా శ్రీ రాయప్రోలు సుబ్బారావు రచనతో ప్రారంభించడము సమంజసము. అందువల్ల 'నవనీతము' శ్రీ రాయప్రోలు సుబ్బారావు రచనతో ప్రారంభము చేసినాము.

౪

శ్రీ రాయప్రోలు సుబ్బారావు తెలుగు దేశములో ఉదయిస్తున్న ఈ నూతనకాంతిబింబమును ముందుగా చూడగలిగిన ద్రష్ట. కథా కథనము ప్రాచీనమార్గముతో సాగిస్తే, పాడిన పాట అవుతుందని తెలుసుకున్నాడు. కథావస్తువులు కూడా సామాన్య జీవితములోనుండి తీసుకొని, అందులోనే ఉదాత్తతా మాధుర్యమూ చూపగలిగినాడు. తన కావ్యములలో వివిధములైన ప్రణయభావములు చిత్రించినాడు. కాని తెనుగుదేశములో కలుగుతున్న ఉత్తేజమునూ నూతనశక్తినీ అనుభవించి ఆంధ్రాభిమానముతో ఉడికిపోయిన ప్రథమకవి ఇతడు! అవి ఆంధ్రరాష్ట్రము కోసము ఆందోళన ప్రారంభమైన రోజులు. ఆంధ్రావళిలో ఆంధ్రులలో ప్రముఖుల మీద కావ్యము లల్లి మెప్పింప జేసినవాడు. సభారంగములలో శ్రీ రాయప్రోలు సుబ్బారావు పద్యాలే ఇప్పటికీ ఆంధ్రాభిమానము

కలవారు ముందుగా చదువుతున్నారు. తెనుగుదేశములో విరుస్తున్న ఈ నవవసంతము ఆయన తెనుగుతోటలో ద్యోతమవుతున్నట్లు మరి యే కావ్యములోనూ ద్యోతము కాదు. ఆ కావ్యము ప్రతిపద మధురము. శ్రీ సుబ్బారావు తెనుగువాడే కాదు. తెనుగునాటి వాడు కూడాను. ఆయన కవిత్వములో ఈ తెనుగునాటి తీయదనము మూర్తిభవించి ఉన్నది.

తెనుగుతోటను 'శిఖిసీశుభావాహన'తో ప్రారంభించి, 'గీతాసఖ్యము' చేసుకొని, పొద్దుపొడుపు నోములుపట్టిన తెనుగునాటి చిన్నదానిచేత 'మంగళాచరణము' చేయించి, కోకిలపాట వినిపించినాడు.

"ఆలకింపుము బాలరసాలశాఖ
నుయ్యేలల నూగుచు మరందలియ్యఫణితి
బాడుచున్నది కోయిల పాటకత్తె
పావనంబైన మాతృసేవా వ్రతంబు"

కోయిల ౨౩ పాటలతో తెనుగుకన్యకు మేలుకొలుపు పాడుతుంది. వాటిలో ఆరు పాటలు ఇందులో ప్రత్యేకించి వేసినాము.

౨

నవకవిత్వము శ్రీ రాయప్రోలు సుబ్బారావుతో ప్రారంభమై సాహిత్య...ంతి కవులతో తెనుగుదేశములో పాడుకొనిపోయినది.

సాహితీసమితి అభినవకవితామండలివలె ఒక్క కవిత ప్రధానముగా కూడుకున్నది కాదు. సమితిలో అనేక మార్గములు తొక్కిన అనేక కవు లున్నారు. సమితికవులకు కీలకమువంటివాడు సాహితీసమితి సభాపతి తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి.

శ్రీ శివశంకరశాస్త్రికి ఆంధ్రాభిమానము తక్కువ. లోకములో ఎక్కడ ఎటువంటి కవిత్వము, ఎటువంటి శిల్పము, చిత్రకళ రూపముపొందినా, అవి అన్నీ అవగతము చేసుకోవలె నని ఆయన కోరిక. ప్రాచ్యపాశ్చాత్యవిజ్ఞానమూ, పురాతనాధునాతన వాఙ్మయములూ చవిచూచినవాడు. సంస్కృతాంధ్ర పండితుడు, అనేక భాషాకోవిదుడు, బహుగ్రంథ ద్రష్ట, స్నేహపాత్రుడు, సరసుడు, ధీరుడు, ప్రతిభాశాలి. ద్వితీయ యౌవనములో పవిత్ర ప్రణయము అనుభవించు [illegible] తలూగి మహాప్రవాహమువలె కావ్యము చెప్పిన ప్రేమశీలి. ఎంతటి భావోద్రేకమున్నా, శిల్పము మరచిపోని ఉత్తమకవి. ప్రేమకూ భక్తికీ భేదముచేయని వైష్ణవుడూ, శైవుడూ. తన ప్రియురాలి నేత్రముల అందము చూచి ముగ్ధుడై తన్మయుడై ఉండే ధనుర్దాసు, శ్రీరామానుజుల అనుగ్రహముచేత శ్రీరంగశాయి దివ్యలోచనములు చూచి మహాభక్తుడుగా మారిపోయిన కథ ఈ 'దివ్యలోచనములు'.

ఉ

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి నవకవిత్వమున కొక నూతనశోభ తెచ్చినవాడు. తెలుగు దేశములో నవ్యకవితను మూలమూల

లా ప్రచారము చేసినవాడు. పూర్వమార్గావలంబకులు ఆయనసూ ఆయన కవిత్వమునూ వృథాగా దూషించినంతగా ఆధునికుల నిక ఎవ్వరినీ దూషించి ఉండరు. అయితే మనస్సులో బాధపడ్డా విరసుల దూషణలను ఒక్క చిరునవ్వు నవ్వుతూ ఒక్క కవిత్వపు చూపుతో నిర్విషము చేయగల మాంత్రికుడు ఆయన!

ఆయన ఏది వర్ణించినా ఏది చెప్పినా మంత్రముగ్ధులను చేయగలడు. మాటలలో, వాటి అల్లికలో, వాటిధ్వనిలో మాధుర్యమూ, సౌందర్యమూ ఉట్టిపడేట్లు చేయగల సమ్మోహనాస్త్రవేత్త. తెలుగు నగిషీ పనులలో ఆరితేరినశిల్పి. శ్రీ దేవులపల్లి 'కన్నీరు' 'కృష్ణపక్షము' 'ఊర్వశి ప్రవాసము' అనే కావ్యసంపుటాలు ప్రకటించినారు. అందులో కృష్ణపక్షములోనుండి 'అన్వేషణము' అనే కావ్యము ఇందులో వేసినాము. అవి వంగదేశములో వైష్ణవకవుల ప్రభావము తెలుగు కవిత్వముమీద చలాయించిన రోజులు. కవులు తమ ప్రణయములు, ఆదర్శములు గోపికలకూ శ్రీకృష్ణునికీ ఆరోపించి మధురకావ్యములు చెప్పిన రోజు లవి. గోపిక కృష్ణునికోసము అన్వేషిస్తున్నది ఇందులో!

౨

శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రికీ శ్రీ దేవులపల్లికీ కొంత సామ్య మున్నది. అయితే ఒకరిని ఒకరు అనుకరించిన వారు కారు శ్రీ వేదుల కన్నీటిలో నిజమైన వేదన ఉన్నది. ఆయన ఆదర్శములలో ఉదాత్తతా, ప్రణయములో నైశిత్యమూ

ఉన్నవి. పద్యబంధము ప్రౌఢమై మధురమైనది.
సంస్కృతాంధ్రజ్ఞానముల సంస్కారముతో ఆయన కవిత్వము ఆరంభించినాడు. శతావధానాలు చేసినాడు. ఇంగ్లీషు భాషా జ్ఞానము ఎక్కువ లేదు. అయినా కవితాత్మకలవాడు కనుక నవ్యమార్గాలలోకి ఆయన కవిత్వము ప్రవేశించింది. ఇందులోని 'నిరీక్షణము' అనే కావ్యములో ఆలంకారికులు 'వాసవసజ్జిక' అని పేర్కొనే నాయికను నూతనపద్ధతిలో రమ్యముగా వర్ణించినాడు.

౮

సజీవులై ఇంకా కవిత్వము చెప్తూ ఉన్నవారి కావ్యాలే ఇందులో చేర్చవలె నని మా ప్రథమోద్దేశము. కాని తెలుగు దేశము ఎటువంటి మణులను స్వల్పకాలములోనే పోగొట్టుకొన్నదో కూడా చూపవలె ననే ఉద్దేశము కలిగి చామర్తి రాజశేఖరరావు, కొండాలి సుబ్బారావు, కొడవటిగంటి వెంకట సుబ్బయ్యల కావ్యాలు కూడా చేర్చవలె నని నిశ్చయించినాము. ఈ మూడు మణులలో నాయకమణి చామర్తి రాజశేఖరరావు!
రాజశేఖరరావు బాల్యమాదిగా కవి. ముందు ప్రబంధ రచనతో ప్రారంభించినాడు. తర్వాత ప్రబంధ శక్తి కొంచెము మార్చి కావ్యరచన చేసినాడు. ఆ తర్వాత నాటకములు, ఒక నవలా కూడా వ్రాసినాడు. కవి అనే ఆదరభావముతో అతనికి చాలామంది మిత్రులైనారు. అతనికి, కొత్తరచన చేసిన తర్వాత, పాతరచన మీద అభిమానము పోయేది. ఎవరో

ఒక మిత్రునివద్ద పాతరచన మిగిలిపోయేది. ఫలితాంశ మేమంటే అతను 'సాహితి' లో ప్రచురించిన కావ్యాలు తప్ప మిగిలినవి ఎంత ప్రయత్నించినా కనబడడం లేదు. అతనితో పాటు అతని రచనలు భద్రపరచిన మిత్రులు కూడా అదృశ్యమైనారు. అతను బి. ఏ. చదువుతూ ఉండగా *Carlyle* వ్రాసిన *Heroes and Hero-worship* అనే గ్రంథము బాగా అతని మనస్సులో నాటింది. ప్రథమ మహాసంగ్రామానంతరము రాజకీయాందోళనముతో దేశము ఉట్టుడికిపోతున్న రోజులు. అతను దేశోద్ధరణ కోసము సరియైన నాయకుణ్ణి తన ఊహతో అన్వేషించ సాగించినాడు. ఆ ప్రయత్నఫలమే 'బృందావనము' అనే కావ్యము! యమునాతీరము బృందావనము; గోపికా గోపకులు కృష్ణుని కోసము వెదుకుతూ ఉంటారు. కవి ఇందులో ఎన్ని భాగాలు వ్రాసినాడో తెలియదు. అతను అకస్మాత్తుగా బెజవాడలో కలరాతో ఇరవై ఒకటవయేట చనిపోయినాడు. సానలుదీరిన జాతిరత్నము ఒకటి దేశానికి పోయింది. చనిపోకముందు వ్రాస్తున్న కావ్యము బృందావనము. దీనిలో భాగవతము కృష్ణకర్ణామృతము చదివిన వారి మనస్సులలో కలిగే మధురభావముతోపాటు నేడు భరతమాత తన్ను ఉద్ధరించగల నాయకుని కోసము పడే వేదనకూడా ద్యోతకమవుతుంది.

౯

చామర్తి సానలుదీరిన జాతిరత్నము అయితే కొడాలి సుబ్బారావు సానరాతికి ఎదురుతిరిగే పుట్టురత్నము. అతనికి పట్టరాని

ఆందోళనా ఆవేశమూ ఉన్నవి. కొంతకాలము 'తిరుగుబోతు' అనే పేరుతో తన కావ్యాలు ప్రచురించుకున్నాడు. అతని 'హంపీక్షేత్రము' ప్రవేశములో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ చెప్పినట్లు అతనికి ప్రతిభా వ్యుత్పత్తీ రెండూ ఉన్నవి. అయితే ఆయన ప్రతిభ వ్యుత్పత్తికి వశంవదమై ఉండదు. ఆయనను చూచినవారికి ముందు మోటుగా కనపడేవాడు, వాక్కు కూడా కొంత కటువుగా తోచేది. కాని పరిచయమైన కొద్దీ అయన హృదయము నవనీత మని తెలిసేది. తెలుగువారి ప్రస్తుత దుస్థితికి చెప్పరాని బాధపడ్డవాడు. అది తెలుగువారు అత్యుచ్ఛస్థితి అనుభవించిన విజయనగర సామ్రాజ్యపునాటి శిధిలములు చూచినప్పుడు ఆగకుండా హంపీక్షేత్రముగా బయటపడ్డది.

'హంపీక్షేత్రము'లో ప్రతిభాగము ఒక అద్భుతమైన క్రొత్త రుచి చూపుతుంది. అందులో 'కనకాభిషేకము'లో శ్రీనాథుడు ప్రౌఢరాయల సభలో డిండిమభట్టును ఓడించి, కంచు ఢక్క పగులగొట్టించి, కనకాభిషేకము పొందిన కథ ఆ కాలములో ఉండి ప్రత్యక్షముగా చూచినవాడు వర్ణించినట్టుగా వర్ణించినాడు. ఆధునికుల ఇష్టప్రకారము శ్రీనాథునికి శిఖాతిలకాలు తీసివేసినాడు. శ్రీనాథునిపాత్ర కళ్ళకు కట్టినట్లు చిత్రించినాడు. విజయముపొందిన శ్రీనాథునీ, పరాజితుడైన డిండిమభట్టునూ, ఉభయులనూ ఉదాత్తనాయకులనుగా వర్ణిం

చదములో కవి చూపిన మేధావిశేషము ప్రత్యేకించి గమనించదగి ఉన్నది.

### ౧౦

చామర్తి, కొడాలి వలె కాక కొడవటిగంటి వెంకటసుబ్బయ్య ఇప్పుడు జీవించి ఉన్నాడో లేడో కూడా ఎవరికీ తెలియదు. అతనికి సంసారము మీద విరక్తి పుట్టలేదు. ఎవరి మీదా కోపము రాలేదు. ఎదుర్కోలేని కష్టాలు రాలేదు. కారణము లేకుండా ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయినాడు. వైరాగివలె దేశాటనముచేస్తూ జీవితము గడపవలె నని అతనికి ఒక సరదా ఉండేది. పాతికేళ్ళు నిండకముందే దేశము వదలినాడు. ఇప్పటికి ఇరవై ఏళ్ళు దాటినా అతని జాడలేదు.

అప్పటిరోజులలో సాహితీసమితి కవులలో అతడు అగ్రగణ్యుడు. కావ్యములే కాక కథలూ నాటికలూ వ్రాసినవాడు. స్వయముగా వేషధారణలో నేర్పు కలవాడు. రామవిలాస సభను ఉద్ధరించుటకు ముఖ్యకారకులలో ఒకడు. ఆంధ్ర ప్రబంధములు అప్పటికి అచ్చయిన వన్నీ క్షుణ్ణముగా చదివినవాడు. ఇంగ్లీషులో అనేక సాహిత్య గ్రంథాలు మథించినాడు. అతడు చదివిన నవలలకూ కథలకూ అంతులేదు. కవితాత్మ కలవాడు. దానిని సాధనవల్ల స్వాధీనము చేసుకున్నవాడు. దేశము విడిచి వెళ్ళేముందు తాను వ్రాసిన కావ్యాలలో ప్రచురించదగినవి ఏరి వాటిని సంపుటిగా సంధ్యారాగము అనే పేరుతో ప్రచురించినాడు. అతని అనంతర చర్యవల్లగాని ఆ కావ్యసంపుటికి అతడు పెట్టినపేరు సార్థకమైనదని తోచలేదు. దానిలోనుంచి

'భిక్షువు' అనే కావ్యము ఇందులో ప్రచురించినాము. దేశము విడిచిపోవడానికి రెండు మూడు సంవత్సరాలముందు వ్రాసిన కావ్య మది. అప్పటికే 'భిక్షువు'ల జీవనము అతన్ని ఆకర్షించే దని ఈ కావ్యమువల్ల కనపడుతుంది. శ్రీ రాయప్రోలు సుబ్బారావు తెనుగుతోటలో తేటగీతిలోని మాధుర్యము చూపిన తర్వాత కొంతకాలము తెలుగు కవులు వృత్తాదుల మీద వ్యామోహము తగ్గి తేటగీతిని అభిమానించ సాగినారు. శ్రీ రాయప్రోలు చూపక విడిచిన మరికొంత తీపి తేటగీతిలో వెంకటసుబ్బయ్య చూపించినాడు.

౧౧

ఇద్దరు కవులు కలిసి ఒక్క కావ్యము సరసముగా రచించడము సాధ్యమా అనే విషయము సంశయాస్పదము. పూర్వము లోక ములో అట్టివి అరుదుగా కనపడుతున్నవి. 'జంటకవనము ఒక్క తిరుపతి వేంకటేశ్వరులకే చెల్లినది. తక్కిన వారికి శోభ లేదు' అని శ్రీ విశ్వనాథ సత్యనారాయణ అన్నాడు. ఈ జంట కవనము శోభించనిమాట కథాకథనము కల కావ్యాలకుకూడా వర్తిస్తుంది; అది ఆత్మనిష్ఠమైన 'విప్రలబ్ధవిపంచి' వంటి కావ్యాలకు మరింత దృఢముగా వర్తిస్తుం దనడములో సంశ యానికి అవకాశమే లేదు.

శ్రీ తిరుపతి వెంకటేశ్వరులు పూర్వకవులలో చివరవారు. వారు ఎన్నో విషయములలో నవ్యకవులకు దారులు చూపించి నారు. శ్రీ తిరుపతి వెంకటేశ్వరుల శిష్యులలో శ్రీ పింగళి లక్ష్మీకాంతం, శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగార్లు కలిసి

కవిత్వము చెప్పుతూ కవు లని ప్రసిద్ధిపొందినవారు. వారి ఉభయుల పేర్లతో ప్రచురించే కావ్యాలు ప్రతిదీ యెవరో ఒకరే వ్రాసిం్రదై ఉంటుంది; అందువల్ల ద్వైకర్త్రకత్వమువల్ల వచ్చే దోషాలు వాటిలో ఉండవు. 'విప్రలబ్ధవిపంచి' శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు రచన అని ఊహించదగి ఉన్నది.

దారువును భావరసానురూపముగా పలికించుకునే నిమిత్తము వీణగా మార్చి విడిచిన తన ప్రభువును సంబోధించి వీణ పలికే మాటలు ఈ కావ్యము. భగవంతుడే కవిచేత కావ్యములు పలికిస్తాడు. కొంతకాలము పలికిన తర్వాత మధ్య కొంతవాక్కు-మౌనము వహించినప్పుడు కవి పడే వేదన ఈ కావ్యములో కవి మనోహరముగా సృష్టించినాడు.

౧౨

ఈ నవనీతమును శ్రీవిశ్వనాథ సత్యనారాయణ 'నవనీతము'తో పరిసమాప్తిచేసినాము. ఇతరులు తనను 'నవకవి' అనడము ఆయనకు ఇష్టము లేదు. ఆయన నవకవులలో నవకవి. పూర్వకవులలో పూర్వకవి. ఇటు కిన్నెరసాని పాటలు వ్రాస్తాడు. అటు ఆంధ్రరామాయణము ప్రారంభిస్తాడు. ఆయన నిస్సందేహముగా కవి!

ప్రథమములో ఆయన తన కావ్యాలు 'గిరికుమార' అనే పేరుతో ప్రచురించేవాడు. అది చిన్నతనములో పెట్టుకొన్న పేరు; కాని అది సార్థకమైనది. అతను నిజముగా గిరికుమారుడే. తర్వాత కొన్నాళ్ళకు ఆయన తన కవిత్వము కిన్నెరసాని వాగు అని చెప్పుకున్నాడు.

భద్రాచలము రైలులో వెళ్ళేవారికి కూడా ఈ కిన్నెరసాని వాగు తగులుతుంది. అది మహారణ్యములో దారిచేసుకొని నాగుబామువలె వంకర వంకరలుగా నడచి నడచి స్వచ్ఛమైన తన నీటితో పరిసరారణ్యభూములను నవనవలాడించి, అఖండ గోదావరిలో కలుస్తుంది. అది చిన్న సెలయేరు కాదు. మహా పర్వత నిస్సృత మహానిర్ఝరము. రాయప్రోలు సుబ్బారావు తన తెనుగుతోటలో,

"పాడుపుణ్యపు ఱేళ్ళు త్రుళ్ళింత లాడెడు విధాన
పాడు మమ్మ గీతాసఖి భావపదము"

అన్నాడు. ఆ కోరిక శ్రీ విశ్వనాథ సత్యనారాయణగా మూర్తి భవించి ఫలించినది. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ కావ్యములు అనేకములు. పోకడలు అనంతములు. ఆబ్రహ్మస్తంబ పర్యంతము సృష్టిలోగల వస్తువులన్నీ ఆయన కావ్యవస్తువులే; ఒక మేకపిల్ల చావు, ఒక కుక్కపిల్ల చావు వర్ణించి సామాన్య మానవుల నిర్ఘృణత్వము సూచిస్తాడు. 'గొంగళి పురుగు' పద్యాలతో చమత్కరిస్తాడు. 'కిన్నెరసానిపాటలు' వ్రాస్తాడు. 'కోకిలమ్మపెండ్లి' వర్ణిస్తాడు. ప్రేమగీతాలు పాడతాడు. గతించిన ప్రియురాలికి శశివల్ల దౌత్యము నెరపించుకుంటాడు. 'శృంగారవీథి'లో మసలను విహారము చేయిస్తాడు. రామాయణ కావ్యము తన స్వంతపోకడలతో వ్రాస్తాడు. కావ్యాలే కావు. నాటకాలు, నవలలు, కథలు, విమర్శలు, ఉపన్యాసాలు— ఒకటి ఉన్నదని ఒకటి లేదని అనకుండా వాఙ్మయ మార్గాలు అన్నీ తొక్కుతాడు. ఎందులోనైనా తన వ్యక్తి

త్వము అచ్చు గుద్దినట్లు నిలవబెట్టుకుంటాడు.

తన శృంగారవీథిలోనుంచి 'ప్రాతస్తవము'లో కొంతభాగము తీసి 'నవనీతము' అనే పేరుతో ఈ సంపుటిలోకి ఇచ్చినాడు. యశోద తెల్లవారుజామున కృష్ణుని మేలుకొలుపుతుంది. యశోదకు కృష్ణుడు కొంతసేపు కన్నకొడుకు. మరికొంతసేపు సాక్షాత్తు భగవంతుడు. మహాభక్తుల అనిర్వచనీయ మార్గములు ఇందులో ప్రతిబింబితమైనవి!

నవకవులు తొమ్మిదిమందివల్ల తీసుకున్న తొమ్మిది కావ్యముల సంపుటి ఇది. నవకవులు ఈతొమ్మిదిమందే అనికాదు; ఈ తొమ్మిదిమంది రచనలలోకూడా ఇంతకంటె రసవత్తర రచనలు లేవనికాదు. ఖండకావ్యాలలో కాస్త పెద్దవిగా ఉండేవి. ఒక్కొక్క రిది ఒక్కొక్కటిచొప్పున తీసి కలిపి ఏకముగా ప్రచురింపవలె ననే సంకల్పముతో చేసిన దీ ప్రయత్నము. ఈ శీర్షికలో ఈ సంపుటము మొదటిభాగము.

ఈవిధముగా ఇప్పుడు ప్రత్యేకించిన నవకవులు తొమ్మిదిమంది రచనలో ఒకరికంటె ఒకరికి విశిష్టత ఉన్నది. ఒకప్పుడు చూడగా పరస్పరభేదము లే కనబడినా, వీరందరిలో సామాన్య ధర్మమే ప్రధానమైనది. వారిలో భేదము బాహ్యమైనది. సామ్యము ఆంతరమైనది. ఒక్క వెలుగులోనుంచి వచ్చిన అనేక కిరణములు ఎట్లాగో, ఒక్క కిరణములోనుంచి వేరుచేస్తే వచ్చే రకరకముల రంగులెట్లాగో వీరూ అంతే: ఈ కావ్యసంపుటము చదివిన వారికి ఈ విషయము అనుభవములోకి రాగలదు.

నోరి నరసింహశాస్త్రి

# తెనుగుతోట

౧

నిదురనెలతలు వచ్చిరి నిదుర లేప,
భద్రభామలు దరిసిరి పాట బాడ,
తెలియరాని చక్కిలిగింత లలము నొడల
మేలుకొలిపెడు పవనుడు బాలుడట్లు;
నవకపు టుషస్సు చిద్రుపలు కవిసికొనెడు
పొదుపుమలపైకి నూగెడు ప్రొద్దుపాప
నుయ్యేలల పైడిత్రాళ్ళన నొదిగి యొదిగి;
రాలు సురపొన్నపూవులు రాసులట్లు,
మధువు చిందుచున్నది సుకుమార లతల,
కొమ్మ లొక క్రొత్తరుచి సరసమ్ము లయ్యె;
వృద్ధతరులు లేమొలకల పెంపు జూచి
యభినవ వికాస దీపన మభినయించు;
తిన్ననిపథంబు బట్టె యాత్రిక జనంబు
లేచి రా వమ్మ ! మా తల్లి ! లేచి రమ్ము!

౨

మబ్బులే లేవు చూడు! విమానవీథి,
ఆశ లాకూతసీమల నంట నల్లె !
తేటి యున్నది జీవనపూర మెల్ల,
క్రమ్మియున్నది నూత్న రాగమ్ము భువిని,
క్రొత్త మంగళతోరణాల్ గునిసియాడ
కోకిలకుమార మంగళోక్తులు ధ్వనించె;
లలితపల్లవ లక్ష్మి తాండవము లాడ,
పసపు బూపిండి కడ లెల్ల విసరుచుండ
నవనవ కుతూహల ప్రసూనములు పూచె;
చీకటి ముసుంగు ద్రోసి హాసించుచున్న
దదిగో ! మంచుల తెరలకు నవల నిలిచి
యొక పవిత్ర తేజోబింబ ముజ్జ్వలముగ;
చూడ బోవుచునున్నారు తోడి చెలులు,
ఆలసించిన నిలువరు హర్ష వశలు,
ముందుబోయిన నంద రో సుందరాంగి !
లేచి రా వమ్మ ! మా తల్లి లేచి రమ్మ !

౩

చదివిన పురాణపంక్తులే చదివికొనుచు
స్నాతకుం డైన విద్యార్థి చాయజూడు;
పడుచు మగబిడ్డ యనియెడు భ్రమను తల్లి
తోట కంపుచు నున్న దెందులకొ గాని,
యెఱుగ డా చిన్నవా డామె హృదయసరణి:
లేతతులసీదళాలు చేసేత గిల్లి
నింపి కొనివచ్చు మృదుపత్ర సంపుటమ్ము;
చంపకము లెత్తికొని పోవు చతురవరుల,
తేనె వంచుక పోయెడు మానవరుల,
పత్రముల నూడ్చుకొనెడి యుపాయమతుల,
కంచె దీసి త్రోవలు సేయు వంచకులను,
తెలియగా లేదు తోట సేవలన గాచు
లేచి రా వమ్మ ! మా తల్లి ! లేచి రమ్మ !

౪

కిన్నెరలు పాడుచున్నవి గీతములను,
కప్పురంపు దుమారముల్ గుప్పినటుల

బది దెసల గప్పుకొనె గాఢపరిమళంబు,
పూత బడియె నశేష భూమీతలంబు
తరుణ తరుణం బయిన యొక యరుణకళను;
సుభగతాంబూల రాగ మంచును వచింతు
రెల్ల పదుచులు వయసు పింపిళ్ళు గూయ,
వెన్నెలకరుళ్ళు నిండారు వీథినదుల
పొడుపు నవ్వుల నావలు నడుప వత్తు
రింటి నింటికి జేరువ నింపు దొరయ;
సరస కౌతుక గీతా ప్రసాద మొకడె
కలద యా నౌకయందు గాపలసి నంత,
పిలిచి యిండ్లిండ్లకును పంచిపెట్టుచుంద్రు,
వలదనెడివార లెవ్వ రవ్యక్తమతులు,
ఆదరింపని వా రెవ్వ రాడువాండ్రు,
లేచి రా వమ్మ! మా తల్లి! లేచి రమ్మ!

౫

దధిమథన మోహన ధ్వనుల్ మధురముగను
శ్రవణముల కుత్సవము జేయు సమయ మయ్యె

ఔపసి కలాప మేమఱ నగునె తల్లి !
ముసుగునం బడి యున్నది మోహవీణ
చిరనిరాదరణాహతి జెడియె నేమొ ?
తలచి తాచి స్పృశించి తల్లలిత లలిత
సుశ్రుతిస్వీయ సామ్రాజ్య శోభ నింత
క్రొత్తలకు రుచి సూపించి హత్తవమ్మ;
పలుకుబడి యింపు, సన్నంపు తెలుగు కళుకు,
కలదు కల దెందు లేదని కలయ జూచి
చేతబెట్టితి నీ వీణ జిన్నదాన !
పాడితివి కొన్నినా ళ్లతిస్వాదువుగను
లోక దుర్లభమోహాన పాకఫణితి
రాగరసబంధురం బైన రమ్యగీతి;
చంపకంబులు గురియ నచ్చరకొలంబు,
ఆట వెలదులు పారవశ్యంబు గొలుప,
అలరి మత్తేభలక్ష్మి కుంభాభిషేక
హృద్య సౌవర్ణ కలశము లెత్తి పట్ట,
పెరిమ బెరయంగ గరువంపు బిరుదుటందె
లడుగుదమ్ముల రారాజు లందగింప,

నిండుముత్యాలశాలల నీటు సూపి
వాసి జూరాడినట్టి నీభాగ్య మేది ?
లేచి రా వమ్మ ! మా తల్లి ! లేచి రమ్మ !

౬

దివ్యసంతతి కెలన భక్తిఁ భజింప
ప్రేమసామ్రాజ్యపాలనా ప్రీణ యగుచు
నిండు గొలువు తీర్చెడి రమణీయమూర్తి,
రాజరాజేశ్వరి కుమారరక్తి మధుర
స్తన్యమోహాంధ యగుచు సాక్షాత్కరించు;
అరసి యర్చింపు మాజగదంబ నపుడు
స్నేహదీపము వెలిగించి చిత్రపీఠి,
పసుపు గుంకుమ పూవులు కొసరి చల్లి,
చిన్ని కర్పూర హారతి చేతబట్టి
పాడవమ్మ ! తెనుగుబాణి భ్రమయ జగము
తన్మయస్తవమధు నివేదనముకలన
బరవశ ప్రసన్నావధి జడయు బ్రకృతి;
తత్తదవ్యయ శుభ ముహూర్తంబునందు

౬

'ఆంధ్రకళ్యాణ' మనుచు బ్రహ్మాండమెల్ల
తానమాడు నపర్యుషితంపు శ్రుతిని;
ఆదరమున తథాస్తు తథాస్తటంచు
ఋషులు ఋషిపత్నులును వచియింపగలరు;
ఆంధ్ర బాలకు పూర్ణకళ్యాణ మవును
నిదుర లేవమ్మ ! మా తల్లి నిదుర లెమ్మ !

రాయప్రోలు సుబ్బారావు

# ది వ్యా లో చ న ము లు

౧

ధ ను ర్దా సు

దేవా, మేదుర తావకీన కరుణా దీవ్యత్కటాక్ష ప్రభా
శ్రీవిద్యోతితుఁడౌచు భాగ్యమునుగాంచెన్ దాసు డీ ప్రొద్దునన్!
కావేరీ పరిపూత శీతల మహాకల్లోలినీస్పర్శ శో
భావంతం బయి పొల్చునూషరధరాభాగంబు చందంబునన్.

ఏనా డే నొనరించినట్టి సుకృతం బెంతో యహీనంబు కా
దేనిన్ యుష్మదపాంగ వీక్షణ మహస్సేలా ప్రవర్తిల్లు నీ
దీనాంఘ్రి ప్రభవాధమాధమునిపై దేవా, కృపాపూర్ణమై?
ఆనందోద్గతి బిచ్చలించినది రోమాంచంబు దేహమ్మునన్!

మీ సందర్శన నవ్య భాగ్యమున స్వామీ, ధన్యతం గాంచితిన్
వాసిం బొందెను నిశ్చయంబుగ భవద్వాల్లభ్యసంలబ్ధి నీ
దాసుం! డా నిఖిలైక నాయకుని సందర్శించిన ట్లయ్యె మీ
శ్రీసాన్నిధ్యమునందు నిల్వఁగనె యక్షీణప్రమోదంబునన్!

౨

స్వామీ, తావకపాదపంకజరజ స్సంసక్తిచే నొప్పెడు
న్నామూర్ధం బుదయార్కమండల దళ న్నవ్యప్రభారంజిత
శ్రీమంతంబగు నంజనాచలగతిన్! సేవాసమారాధనో
ద్దామప్రౌఢిమ నాకు లభ్య మవుతన్ త్వత్సన్నిధానంబునన్!

ఈదాసాధముమీద నేల పడెనో ఈనాదుజ్ఞాన ప్రభా
శ్రీదంబైన భవత్కటాక్షము కృపాసింధూ, వచింపంగదే!
మోదస్ఫూర్తి సమాచరించు ద్రుటిలో మూర్ధంబుపై నిల్పి త్వ
త్పాదాంభోజముల న్నియోగముల నీదాసానుదాసుం డిదే!

భగవద్రామానుజులు

కనుగొన నిన్ను సంతసము కల్గిన దెంతయు నేడు మాకు; నీ
వినయ మకృత్రిమోద్గతిని వెల్లడి యయ్యెను, భక్తిభావమో
ఘన మధుర ప్రకారమున గానగవచ్చెను, నీ ప్రవర్తనం
బనుపమభంగి నొప్పెను మదాశిషముం గొను మోకుమారకా!

జననము శూద్రవంశమున సంఘటిలంగనె లోపమేమి? ఆ
ననమున సౌమ్యదీధితి కనంబడుచున్నది, భాషణంబులం
దొనరె నకల్మషారభటి, యోగ్యతయున్నది పెక్కురీతులన్—
ఘనమగులోప మొక్కటియె కానగవచ్చెను మాకు నీకడన్.

నది నవగాహనాదిక మొనర్చి మఠాగమనాభిలాష నీ
యుదయమునందు మేము చనుచుండెడి వేళను శిష్యపంక్తితో
ఎదురుగ వచ్చినావు మది రేక్షణ కొక్కటె కాతపత్రముం
బదిలముగా ధరించి యిరుపార్శ్వములన్ జనుచున్ స్ఖలద్గతిన్.

తరుణి విలోచన ద్వయిని దప్పక నిల్పితి వీక్షణంబులన్
సరసన పోవువారల దెసం గనుగోవు, లవంబు సైతమే
నరసినయట్లు లేదు పథమందలి వింతలనైన; గామినీ
పరవశబుద్ధితో జనెడిభంగి కనంబడినావు దాసుడా!

పొలతుకమీద నీకు బరిపూర్ణముగా ననురాగ ముండనీ,
చెలియకు దద్విధంబున నశేషజనమ్ముల ముంగల సేవలన్
జలుపుచు, లజ్జ బోవిడిచి సంచరిలం దగునయ్య? ప్రేముడిన్
నిలుపగబోలు రమ్యముగ నిండు మనమ్మున గూఢవృత్తితో.

ధ ను ర్దా సు

స్వామి, భవత్పదద్వయము సాక్షిగ బల్కెద విశ్వసింపుడీ!
భామిని మీది మత్ప్రణయభావము వెల్లడిసేయు బుద్ధి నా
కేమియు లేదు, లజ్జ ద్యజియించెడి కోర్కెయులేదు, ధూర్తతం
గామినికిన్ సపర్యలను గా దొనరించుట దేశికాగ్రణీ!

కావరబుద్ధిగాదు పథగాముల జూడకయుంట, వింతలో
యేవియు బట్ట, వాకువలయేక్షణ దివ్యవిలోచన ద్యుతి
శ్రీ వసివాడు భాస్కర రుచిప్రసరంబున నన్నభీతి నో
దేవర, యామెనుండి నిజదృష్టి మరల్పగనైతి నయ్యెడన్.

ఆమెను జెప్పినట్లు 'మదిరాక్షి' యటంచు వచించినార లో
స్వామి, విధేయదాసజను సాహసముం క్షమియింపగా వలెన్;
ఆమహిళాలలామ విమలాయతనేత్రము లుత్పలప్రభా
ధామముగాని వేఱొకవిధం బగునే పరికించి చూచినన్ ?

మానసహారులై, మధురమంజుల నూతనకాంతి నొప్పి, ల
క్ష్మీనిలయంబులై, వెలయు చిత్రగతిం బ్రియురాలినేత్రముల్
పూనుట దుర్భరంబగు బ్రభూ, తమదాసుడు మేన బ్రాణముల్
మ్లానముయెల్యనేని యణుమాత్రము తన్నయనోత్పలచ్ఛవుల్

భగవత్ప్రమాణములు

తెలియగవచ్చె మాకు భవదీయవిధం బిపు డంతయుం సుతా
చెలియవిలోచనద్వయికి జేయుచునుంటివి సేవ, మంచిదే!
కలికి మనోజ్ఞనేత్రముల కన్న మనోజ్ఞమయై మహోద్యుతుల్
గొలిపెడి నేత్రయుగ్మమునకుం నిరతంబు సపర్యచేయుదే?

### ధనుర్దాసు

ఎక్కడగూడ నాకువలయేక్షణకన్నుల కాంతికన్న సొం
పెక్కిన యంబకద్యుతుల నెన్నడు జూడగ లేదు। మిక్కిలిం
జొక్కపు నేత్రయుగ్మమును జూపుదురేని మహానుభావ, నే
నిక్కపుభక్తిభావమున నిత్యము దాస్యము జేయకుందునే.

### భగవద్రామానుజులు

ఆనందంబు ఘటిల్లె మాకిపుడు వత్సా, నీవచో ధోరణిన్,
నీ నిష్కల్మషవృత్తి శిష్యహృదయోన్మేషం బొనర్చెం గదా!
కానం బోవుద మెల్లరుం గదలుడీ కల్యాణకాంతిచ్ఛటా
స్థానంబై విలసిల్లు దివ్యనయన ద్వంద్వంబు శీఘ్రంబుగన్!

౨

### భగవద్రామానుజులు

పరమాకారణ జాయమాన కరుణాపాంగ ప్రసారంబునన్
భరితాజ్ఞాన దురంత సంతమసమున్ భంజించుచున్ విష్టప
స్థిరసంరక్షణ భారమూనిన మహా శ్రీరంగనాథా, భవ
చ్చరణాబ్జంబుల కే నొనర్చెద నమస్కారంబు భక్తప్రియా!

అవలోకింపుము వత్స, అల్లవె రమాహ్లాదాను సంధానవై
భవముల్ ధిక్కృత భానుమండలరుచుల్ బ్రహ్మాండ సందీపక
చ్ఛవులుఙ్ భక్తిభర ప్రపన్నజనతా సంరక్షణ ప్రాభవో
త్సవముల్ రంగశయాన దివ్యకరుణా సంఫుల్ల నేత్రాబ్జముల్।

ధనుర్దాసు

అహాహా ఎంతమనోహరంబులు త్వదీయ ప్రస్ఫురన్నేత్రముల్!
మిహిర ప్రస్ఫుట చండమండల సమున్మేషప్రభల్ కల్గియుం
దుహినాంశుద్యుతి శీతలమ్ములయి సంతోషం బొసంగెన్; భవ
న్మహిమంబొప్పు మహాద్భుతంబుగను శ్రీమద్రంగధామప్రభూ!

అవలోకింపగనైతి నేటివఱ కాహా! దుర్విపాకంబునన్
భువనత్రాణన భూరిశీతల కృపాపూర్ణ ప్రభావస్ఫుర
ద్భవదక్షిద్వితయంబు; దేశికదయాప్రస్యంది వాఙ్మాధురిన్
నవసౌభాగ్యము కల్గె నక్కజముగా నాకో జగన్నాయకా!

స్థిరతాత్పర్యముతోడ గన్గొని చో దేవా, భవన్నేత్రముల్
తిరుగన్నేర్చునె బుద్ధి యన్యనయనోద్రిక్త ప్రమోదంబునన్?
పరమప్రీతిని భృంగమాసవ సుధాపానాభిలాషన్ దళ
త్సరసీజంబుల వ్రాలు గాని యితరక్ష్మాజంబులం జేరునే?

తల్లావఝ్ఝల శివ శంకర శాస్త్రి

# అన్వేషణము

"తలిరాకు జొంపముల సం
దుల త్రోవల నేలవాలు తుహినకిరణకో
మల రేఖవో। పుష్ప దీపవో।
వెలదీ! యెవ్వతెవు నీపవిటపీ వనిలోన్?

కారుమెయిళ్ళ కాటుకపొగల్ వెలిగ్రక్కు తమాలవాటి నే
దారియు గానరాదు నెలతా! యెటు వోయెద వర్ధరాత్రి? వి
స్ఫారవిలోచనాంధ తమసమ్ముల జిమ్ముచు, వేడివేడి ని
ట్టూరుపులన్ నిశీథ పవనోర్మి వితానము మేలుకొల్పుచున్"

"అది శరద్రాత్రి; శీత చంద్రాతపాంత
రాళ రమణీయ రజత తల్పంబునందు
జల్లగా నిద్రవోవు వ్రేపల్లెవాడ
సకలగోపాలగోపికా జనముతోడ.

సాము సడలిన పతిపరిష్వంగమందు
సుఖము దుఃఖములేని సుషుప్తిలోన

# కృష్ణశాస్త్రి : అన్వేషణము

స్వప్నవీథీ యథేష్ట సంచార కలన
మేను మఱచిన నన్నంత మేలుకొలిపె

శర్వరీ శీతపవన పక్షముల మలసి
స్వాదు యమునోర్మిసంగీత ఝరుల గలసి
కౌముదీధౌత శుభ్రదిక్తటుల సొలసి
మురళికామంద మందమాధురులరుచులు

ఎలదేటి చిఱుపాట సెలయేటి కెరటాల
బడిపోవు విరికన్నె వలపువోలె
తీయని మల్లెపూదేనె సోనల పైని
తూగాడు తలిరాకు దోనెవోలె
తొలిప్రొద్దు తెమ్మెర త్రోవలో బయనమై
పరువెత్తు కోయిల పాటవోలె
వెల్లువలై పారు వెలది వెన్నెలలోన
మునిగిపోయిన మబ్బుతునుకవోలె

చిఱుత తొలకరివానగా జిన్నిసోనగ
బొంగిపొరలెడు కాల్వగా నింగికెగయు

కడలిగా బిల్వ గ్రోవిని వెడలు వింత
తీయదనముల లీనమైపోయె నెడద

పరువు పరువునబోవు నెదతో
పరువులెత్తితి మఱచి మేనే
మఱచి సర్వము నన్ను నేనే
మఱచి నడిరేయిన్!"

"ప్రాణనాయకు కౌగిలి పట్టు వదలి
యిల్లు వదలి యెన్నండు నీపల్లె వదలి
యడుగిడనిదాన వానాటి యర్ధరాత్రి
విజన పథములబడి యెట్లు వెడలినావు?"

"తావులతోడ దేనియల ధారల జిప్పిలు వేణుగీతికా
రావముతోడ మందగతులన్ జనుమారుతముల్ విశాల బృం
దావన వీధులందు యమునా నవభంగ మృదంగ వాద్యముల్
త్రోవ స్ఫురింపగా వలపుతోందర వెట్టగ బోతి నొంటిమై

నన్నని యెల్గెత్తి జాలిగా నెవరినో
యరయుమా! పిలుచుచున్నదిదె యమున!

ప్రక్క-సర్జీవ ధావళ్యమ్ముతో నున్న
సికతాతలమ్ము గాంచితివె, దాని?
తుదిమొదల్ లేది దేత్రోవరుల్ త్రొక్కని
యీదారినె పరువెత్తినాను!
ఈ మొండిచేతుల నెత్తి యీవనతరుల్
శూన్యదృక్కుల దిశల్ చూచునయ్యొ!

ఇచటనె-యిచటనె-యట-డిచట నేను—
ఇచట నీ జాజిపూబొదరింట నేను—
ఈకడిమిచెట్టు క్రిందసుమ్మా యతండు—
సరిగ గన్నుల గట్టిన సరణి దోచు

శారదశర్వరీ మధుర చంద్రిక సూర్యసుతా ప్రవంతికా
చారువినీల వీచిక ప్రశాంత నిశాపవనోర్మిమాలికా
చారిత నీపశాఖిక కృశాంగిని గోపిక నేను నాడు బృం
దారమణీయసీమ వినినారము మోహన వేణుగానముల్

మలయ పవను కౌగిలిలోనె పులకరించి
హాయిగా గంతమెత్తు ప్రాయంపు వంశి

విశ్వమోహను జిలిబిలిపెదవు లంటి
యవశమై పోయి యేమి చేయంగ లేదు

బాలగోపాలు బోలెడు పాటగాని
గని విని యెఱుంగ మెన్నండు; కరములోని
మురళినేకాదు, నాలోని మోడుబెడద,
నీశిథిల జీవనమ్ము మ్రోయింప గలదు

నందగోపకుమారు నానంద మురళి
కామనోహర సుషిరాపగాతరంగ
జాలముల దారకారవిచంద్రతతులు
కరగి చిని చిన్నిగీతులై కలిసిపోవు

చూచితిరో లేదో చిన్ని కృష్ణుని సొబంగు!
పెదవి చివురు సంజల నరవిచ్చు నవ్వు
వెన్నెల, చలించు తుమ్మెద బెళుకు చూపు,
లోలపవనచాలితకుటి లాలకమ్ము,
తరళచూడాకలాపమ్ము, మురళిగూడి
యల్లనల్లన గొంతెత్తి యమృతగాన

## అన్వేషణము : కృష్ణశాస్త్రి

శీతలతుషారముల విరజిమ్ము వేళ
జిన్ని కృష్ణుని సొబగు జూచితివో లేదో?

లేవు శరత్తమస్వినులు లేవు మనోజ్ఞసుధాంశుమాలికల్
లేవు వినీల నిర్మల కళిందసుతానవనాట్య సంపదల్
లేవు మదీయ గాత్రలవలిం బులకాంకుర కోరకావళుల్
లేవు కుమార గోప మురళీ మృదు గీత ఝరీ విలాసముల్!

జిలిబిలి పట్టురేకుల వెన్క దొట్రిలు
మల్లియయెద దాగు మధుపరవము
కను చూపు దాటు నామని బాయుకోయిల
గొంతులో జిక్కు వసంతగీతి
విభు వీడి శుష్కించువిరహిణి సెలయేటి
కడుపులో నడగిన కడలి మ్రోత
జేవికై వెదకెదు ఆకచూపులలోన
జెరవడ్డ నిండుచందిరునిపాట

యిట్లు నీ దీన గోపికా హృదయమంది
రాంతరాళములోన ద్రుళ్ళింతలాడు

# న వ నీ త ము

వేణు నాదంబు, విడిపింపు విశ్వమోహ
నాకృతి గిశోరగాయకు నరయుచుంటి

ఇది నాచరితము విని నీ
వదరెదు తొట్రిలెదు వడకు దటు నిటు కనులన్
బెదరుదు చూపుల నేదో
వెదకెదు? ఎవ్వతెవు నీపవిటపీ వనిలోన్?”

దేవులపల్లి కృష్ణశాస్త్రి

# నిరీక్షణము

అనిలతరంగమాలికలయందున జల్వల జల్లు తీయ వా
సన పసిగట్టి యంధతమసమ్ములు మూసిన యీనిశీథ మం
మున నను జూడ నీవె దయతో నును రెక్కల దాల్చి వత్తు వం
చు, నిటుల వాకిలిం దెరచి చూచుచునుంటిని వీధి సారెకున్

కురులను దువ్వి, పూ ల్ముడిచి, గొజ్జగిపూవుల లేమెరుంగుటం
బరము ధరించి, గంధకలపమ్ముల మేన నలంది, కమ్మక
స్తురి తిలకమ్ము నెన్నుదుట సొంపుగ దిద్ది, సువర్ణభూషణో
త్కరముల దాల్చి ద్వారసవిధమ్మున నిల్చితి వెచ్చనూర్చుచున్

విచ్చినయట్టి బండిగురివెందపువుల్ గొనితెచ్చి మాలికల్
గ్రుచ్చితి బాలకన్న నతికోమలమైన భవచ్ఛరీరమే
నొచ్చునొయంచు జక్కగ గనుంగొని కమ్మనితమ్మిపుప్పొడిన్
దెచ్చియె పాన్పుపై బరచితిన్ సకలమ్మును సిద్ధపెట్టితిన్

అలికిడి యేదియైన వినినంత గవాక్షము నుండి లేచి మే
న్పులకలు దేర, బాదముల నుద్దడబా టిగురొత్త, మారుతో

చ్చలితకదంబ పల్లవము చాడ్పున నాయెద సంచలింప, న
ల్గెలకుల వీధి యెల్ల బరికింతు జలింప నిశాంధకారముల్

నీ యనురాగ గీతికల నీ పదసన్నిధి గంఠమెత్తి నే
దీయగ నీవు మెచ్చుకొను తీరున బాడ బ్రదోషయామ మం
దే యిటు మేళవించి శ్రుతి దీర్చిన వల్లకి యర్ధయామినీ
వాయుతరంగ సంహతి నపశ్రుతు లీను విభిన్న తానమై

కలువల తేనె లాని వలిగాడ్పు మదాననకీర్ణ చూర్ణ కుం
తలములతో సయాటము లొనర్పగ నా చెవి నూదునేమొ నీ
పొలకువయంచు నూర్పులెగబోయుదు బ్రాణములో నిప్రాణమై
పొలిచిన వానికేని దయపుట్టని దుర్విధి నాడిపోయుదున్

రేయి పదే పదే కనులరెప్పల స్వప్నపు నీలి క్రొందెరల్
నేయ దపించు నా యెద జలించిన మ్రోతలె నీ పదస్వనం
బో యని యూపి రాపి వినుచుంటి జలత్తరుశాఖనీడ వా
తాయనబింబితమ్మయి త్వదాగమన భ్రమ గొల్ప మాటికిన్

రావనుకొందుగాని యనురాగము ద్వారముమూయనీదు, దుః
ఖావహ మానుగాని భవదాదరపాత్రము లంచు వేషభూ

## వేదుల : నిరీక్షణము

పావళు లూడ్వ లే, నిటు నిరాశ యొకింత యొకింత యాశగా
శ్రావణలక్ష్మినై నిలువ జాలక యుంటిని వెల్గునీడలన్

చీకటి గ్రమ్ముకొన్న వనసీమను బూవులు రాలు చప్పుడుల్
జోకదొరంగి రాల్పడు నెలుంగున జక్కవ పెంటి గూయు నా
నాకరుణారవమ్ములు వినంబడ నా హృదయమ్ము దుర్నిమి
త్తాకుల మౌను శంక గొనినట్టి వనీమృగికుండె పోలికన్

ప్రేమవిహీనమానసమురీతి విషాదపయోదధూమముల్
బ్రామిన యట్టి యీ భయదరాత్రి నిమేషపరాజ్ముఖమ్ములౌ
ప్రేమవిలీనదృష్టుల వివిక్తపథమ్మును జూచుకొంచు నో
స్వామి యికెంతసేపు గడపంగలనోయి! ముహూర్తకల్పముల్

వేదుల సత్యనారాయణ శాస్త్రి

# బృందావనము

౧

ఓ వనదేవతా! నవనవోత్పల కోమల నీలమూర్తి, వ
న్యావిటపీ కుటీర సముపాంత సమస్త పథానువర్తి, లీ
లా విభవైకమూర్తి, సదలంకృత చారు శిరోవిభాసి, బృం
దావన గోపబాలకుడు నందకుమారుడు కానరాడుగా?

మావుల తోటలో దలిరు మావుల సంజలలో నలందు నె
త్తావులలో బువుంబొదల తావులలో బొలుపారు కప్రపుం
దీవులలో గనంబడెడి దివ్యుడు చీకటి కానలోన మా
గోవుల డించిపోయె నెటకో — యెటు జూచిన జాడలేదుగా?

గొల్లడు లేడు కాయుటకు, గోవులు చిందరవంద రయ్యె, భీ
తిల్లె మృగారవంబులకు దిక్కులు నాలుగు పిక్కటిల్లె, మా
యుల్లము తల్లడిల్లె, నిదిగో యని కన్నులు కట్టిపోయె, మా
నల్లని సామి రాడె చిఱునవ్వు మొగంబున చాండవింపగన్?

కోపోద్దీపితుడై నిరాయుధుల జంకుం గాంచి యింద్రుండు దా
మాపై బంపె మహోగ్రపావక శిలాపాతంబు, లేరో మముం
గాపాడంగలవారు దీనజనరక్షాదక్షు లీ ధాత్రి మా
గోపాలుం డిట రాకమున్నె మరలన్ గోవర్ధనం బెత్తగన్?

గోవులు పోవునో? కసవు కోసము మిక్కిలి మోమువాచి వా
పోవునొ? యెండునైన మృగతృష్ణల గాంచి భ్రమించి తప్పునో
త్రోవ? మృగాలధాటి బడునో? యిక గీ డెఱుగంగజాల మ
మ్మా, వనదేవతా, వెదకుమా మనసార కుమార కృష్ణునిన్!

తీయని స్వాదు నీరములు తీయదనంబు దొరంగె నోలిమై
బాయక యెండ బాఱె మన పచ్చిక భూములు, తల్లిగోవు పా
లీయదు మున్నుపోలె గుడిపింపను లేగలనైన గాని, యే
దో యొక కీడు మూడెగనరో! మన మందలలోన గోపకుల్!

'కో' యను గండుకోయిలల కూజితముల్ వినరావు సొంపుగా,
హాయి నొసంగు చెందొవలరాయడు వెన్నెలగాయరాడు, బృం
దా యమునా సమీరముల తావులు మేనున సోకరావు, కృ
ష్ణా, యెటు పోతివో యెఱుగవా యనివార్య దవాగ్నికీలలన్?

గొల్లలలోన గొల్లలకు గూడని పో రుదయించె, ముప్పు వా
టిల్లె, మృగాలధాటి ద్విగుణించె, ప్రమాదము సంఘటిల్లె, త్రే
పల్లెను బెద్దగొల్ల డొక్కడెనను గంటికి గానరాడు, నీ
పిల్లనగ్రోవి నాది శమియింపగదోయి ప్రసన్న మూర్తివై!

ఓ గోపాలకులార, యేటికి విషాదోద్రేక సంరంభముల్?
మీగోబృందము, మీసతీతనయులున్, మీకున్న సర్వస్వమున్,
రాగ ద్వేషము బాపి మీ కొసగి రక్షించి పాలింపగా
మీ గోపాలుని జూపువాడ నిదిగో మీ రింక శాంతింపుడీ!

ఈనడిరేయిలోన, మఱి యీ యమునా పులినంబులోన, నీ
కాననసీమలోన వెదకం బనియేటికి మందబుద్ధులై?
మీనిలయాంతరాళముల మీయిలవేల్పయి యున్నవాడు: పొం
డో, నిదురింపుడో, తెలియుడో, యిక్కనైన బురాణపూరుషున్!

౨

ఆయమునానదీపరిసరాంతర సైకతసీమలందు, నా
తోయతరంగమాలికల తుంపురులందు, మహామహీరుహా

చ్ఛాయలయందు, చారుతర శారదరాత్రుల గోపగోపికా
గోయుతుడైన యొక్క కరిగొల్లని పిల్లనగ్రోవి యెన్నడో!

పున్నమరేలనో, నెఱయు పుప్పొడి తావులనో, రసాలపుం
గున్నలపొంతనో, సొగసుకోయిల డాగినమావి మీదనో
క్రొన్ననలందునో, యెటనో గోకులకృష్ణుడు గొల్లపల్లెలో
నెన్నడు పాడెనో, మరల నెన్నడు వీనుల విందు సేయునో!

అల్లన పూర్ణిమా విమలయామును లెన్నడు మళ్ళివచ్చునో
మల్లెలతావిలో మలయమారుతు డెన్నడు క్రొల్లలాడునో
చల్లన పండు వెన్నెలల చల్వల వెన్నెడు జాలువారునో
గొల్లడు చిన్నికృష్ణు డతికోవిదు డెన్నడు పాటబాడునో!

అడుగులజాడ లేవి? నడయాడిన పాదపుజిన్నె లేవి? కా
ల్నడకలగుర్తు లేవి? మధురం బగుపిల్లనగ్రోవి యేది? యే
కడ బడనైచెనో, మనసు గాఱియ వెట్టగ నెందు నుంచెనో,
మడుపుల డాచెనో, వనరమాతిలకంబ! యనుగ్రహింపవే!

ఓ యమునా! నిరంతరము నొక్కగతిం బ్రవహించుదానవై
యీయెడ గ్రోలియుండితివి ఆమృదుగాన రసామృతంబు, లీ

లాయుతమై, మనోజ్ఞమధురం బగుగీతము నొక్కఁ డేనియుఁ

హాయిగ బాడి తీవ్రహృదయానలకీలల నార్పలేవుగా?

ఎంతటి పూర్వపుణ్యమున నీయిలపై జనియింపగంటివో,

ఎంతతపోమహత్త్వమున నీవనిపై బ్రవహింపజాలితో,

యెంతయదృష్టశాలినివో కృష్ణునిగానము నాలకించి య

త్యంతముగాగ జన్మఫల మందితిగా, యమునా ప్రవంతికా!

యామిను లెన్నొ మందమలయానిలసుందరసాంద్రచంద్రికా

స్తోమవిరాజితంబు లయి సొంపలరారెను గాని, యోశర

ద్యామవతీ! నినుం గనినయంతన కృష్ణమనోజ్ఞ గీతికా

కోమలరామణీయకము కొంత కనంబడెనమ్మ నీయెడన్!

ఆమధుమాసయామినుల కాసవహించితిగాని బాలకృ

ష్ణామలవేణుగానవిషయమ్ము లెఱుంగవు నే? విశ్వమోహన

మో మృ,మృదులంబొ, మంజులమొ,ముగ్ధులగోపకు డెల్లనాడు దా

నేమనిపాడెనో కనికరింతువె శారదయామినీమణీ!

సాంద్రతమోమయంబయినశర్వరికిం గురిమైతివో, శర

చ్చంద్రసుధాప్రపూర్ణ మగుచంద్రికలోన నిమగ్నవైతివో

ఇందుశిలా స్రవంతికల కేగితివో జలకేళి సల్పగా
మందసమీరవారములు మై నడయాడిన సుప్తిజెందితో.

పరవశవైతివో మురళిపై మృదుపల్లవపాణినుంచుచో,
మరచితివో ప్రపంచము కుమారుడు కుంచితపాద మెత్తుచో,
కరగి స్రవించెనో మనసు గజ్జెలుఘల్లని మ్రోయునంతలో
నెఱుగవొ! యింకనైన వచియింపవొ! యామవతీ సతీమణీ?

వెన్నెల తేటలో, నమృత వీచికలో, నెలతాల జాలులో
పున్నమ రేయిలో, భువనమోహన గానరసంబు వెల్లిమై
తెన్నుల బారెనో, యకట దేవత లాకొని యారగించిరో
యిన్నర జాతికిఁక మరి లభింపదొకో, యికముందు తల్లిరో!

ఇలు విడి యర్థరాత్రమున నేగితి రా మురళీ మనోజ్ఞమా
కలరవ మాలకించితిరి, గానరసామృత ముగ్ధపాలతో
గలిపి యొసంగలేదె పసికందులకున్ వ్రజకాంతలార? వే
బలుకరె? మీర లెంత పొరపా టొనరించితిరమ్మ! బేలలై

3

గుణుడొ గుణుండుగాడొ ధరకుం గల భారము రూపుమాపగా
జననము నొందెనో తెలియజాలము గాని మహానుభావులా

సనకసనందనాదులకు సైతము చూపుల కందరాని యా
మనసిజమూర్తి మా పసులమందల బిల్లనగ్రోవి నూదెగా!

ఆయమునానదీ జలతరంగ రవంబున లీనమయ్యెనో,
వాయురవానుకారి యయి వాయువులో బరదేశ మేగెనో,
కోయిల కూయితో గలసి 'కూ' యను శబ్దముగాగ మారెనో
యే యెడ చేరెనో జగతి కింపగు వేణునినాద మక్కటా!

మావి చిగిర్చెనో, పసులమందలు మ్రాన్పడి యట్టె నిల్చెనో,
గోవులు మోర లెత్తెనొకొ, కోయిల గానము నాపివేచెనో,
తీవెల పూవులం దగిలి తేటులు తేనియ లానమానెనో,
యే విధ మయ్యెనో ప్రకృతి యించుక కృష్ణుడు వేణువూదినన్

పాము విసంబు బాసెనట, నన్నెమెకంబులు గోవుమాంసమున్
నీమముతోడ ముట్టవట నింద్య మటంచును, సింగ మెన్నడున్
బాముల బెట్టదంట యొకొ నన్యమృగంబునునైన గాని, బృం
దామహనీయ వేణునినదంబు సతంబు ప్రతిధ్వనింపగన్

ఓ వెఱిగొల్లలార! మహిమోన్నతగానము నాలకింపరో,
పావనమైన గానరసవాహినిలో దల మున్క వేయరో,

కేవల బాల్యమిత్రు లయి కృష్ణుని పిల్లనగ్రోవి నూదరో,
గోవులు గాయరో వనుల గూడరో చల్లుల నారగింపరో

ఎంతటి మందభాగ్యులకో యీ వెఱిగొల్లలు, భావగీతి నా
ద్యంతము మత్తులై మరచి రక్కట! ముందు జనింపనున్న మా
సంతతి వారికై మరల జక్కని పిల్లనగ్రోవి బూని వా
యింతువొ, యెన్నడైన నుదయింతువొ కృష్ణకుమార! ధాత్రిపై

గందపుజెట్లు గూలె, బలు గచ్చపొదల్ కడువృద్ధిగాంచె, మె
త్తందన మొప్పు మార్గములు దట్టము లయ్యె శిలామయంబులై
పిందెలు పూలతోట గనువిందగు తీవలు మోడు లయ్యె, నా
నంద మనోజ్ఞ గీతముల నందకుమార! యనుగ్రహింపవే

కనబడవోయి కృష్ణ! చిఱుగంటల నాట్యము సల్పవోయి, నీ
యనుపమజాయమాన కరుణామృతముం గురిపింపవోయి, మా
మనసులలోన నివ్వటిలు మాంద్యములం దొలగింపవోయి, మో
హాన మొనరింపవోయి సచరాచరమైన ప్రపంచజాలమున్!

చామర్తి రాజశేఖరరావు

# విప్రలబ్ధవిపంచి

దేవర దివ్యచిత్తమున దీయని భావము లెత్తఁ ఘట్టి, యీ
కేవల దారుగర్భమున గీల్కొలుపంగ నను గ్రహించి, త
ద్భావరసానురూపమగు పట్టునకున్ దగ మేళవించు కొ
న్నావుగదా, యొకప్పు డయినన్ బలికింప వదేమయా, ప్రభూ!

భవ దమృతపాణిపద్మ సంస్పర్శ బల్ల
వించు నా మేన నిముడక పిక్కటిల్లి,
వెలి విరియు నాటి నీ దివ్యవిమలగాన
మధురిమము చూఁరగొనక నన్ మఱచితేమి!

భవ దనురక్తి దీన, బరిపాల్య ననాదృత జేసి, రాచ బా
ట విడిచిపోతి వీ విటు కటా! రసభావ పరంపరాస్మృతుల్
దవిలిన నా యెడంద నడుదారిని దిన్నమొలర్ ధరారజం
బు వోదువగూయివెట్టెదు బ్రభూ! వెడగాడ్పులుమీటదంత్రులన్

నను లాలించుచు వింతవారు, నను గన్నారంగ వీక్షించి కుం
దనపున్‌వీణియయన్న భ్రాంతి మెయిమత్తంత్రుల్ వెసన్ మీటియున్

మును నీ పట్టులు దాచుకొన్న తలపుల్ ద్రోయింపగాలేర; వా
రును వీరున్ మొరయింప నాతలపుదీరుందీయముల్ మాసెడిన్.

వీణియయంచు నేరయిన వేడుకమై బలికింపవచ్చినన్
మానక యుద్గమించు నతిమానసవృత్తులు దాచి, మూకతన్
బూనుచు జిన్నబుచ్చుటలు వోలదటం చెద విచ్చుబాఱ; దం
త్రీనిచయమ్ముగూడ దెగ, రిక్తశ్రమంపడి తూలిపోయితిన్.

నాయరిపేదమానసమునన్ దులకించు రసార్ద్రభావముల్
కో యని క్రోల్చి, లోకములకున్ నెరవిందులు వెట్టజాల; బో
నీ, యడగించి యూరకొననేనియు నేర, మఱేల, నాకు నీ
మోయగరానిభారము? ప్రభూ! నను దేర్పవె శీర్ణమానసన్.

నీవు దాచుకొన్న నిక్షేప మిక గుప్తి
సేయజాల, జీర్ణశిథిలహృదయ
కుహరమును వెలార్చి, కొను మపాత్రన్యస్త
మేల నీకు నిటు లుపేక్ష సేయ?

లేదా, నూతన జీవదాయినఖపాళిన్ దంత్రు లల్లార్చి, నా
సేదల్ దేరిచి, తొంటిరాగరసముల్ సిందన్ శ్రుతుల్ దిద్ది, ది

వ్యోదంత మ్మఖిలార్థికోటులకు బీయూషోపహారం బిడక
రాదే! రెంటికి జెడ్డ రేవడ నౌసర్పం బాడియే నన్నిటుల్.

ఒకయింత గవిసెసి యూడ్చెదే నలనాటి
భవ్యమూ నీరూపు బట్టికొననా!
ఉత్సంగమున జేర్చి యుపలాలనము సల్ప
నల్లంత నీమేన నల్లుకొననా!
కొనగోట నింత మీటిన డెంద మోడికల్
గట్ట గానమ్ముగా గరగిపోనా
మనసిచ్చి పల్కరించిన జాలు, వెతవిస్మ
రించి నీలోన లయించిపోనా!

నీరసనిదాఘనీరవ నిర్ఘృణత్వ
మోపజాల, రసోత్కంఠ నాపజాల
భద్రమగు నీ కరావలంబన మొసంగి
మృదుల పృథులాంకమున జేర్పగదవె నాథ!

పింగళి లక్ష్మీకాంతం
కాటూరి వెంకటేశ్వరరావు

# కనకాభిషేకము

"గణగణమ్రోయుఢక్కయది కంచుదియంట, చతుఃశ్రుతిప్రచా
రణమున వ్యాసమాని యట, రాయలుమెచ్చిన కింకవీంద్రవా
రణ మృగరాజ మంట భళిరా మన డిండిమభట్టు; వాని పే
రణచగ వచ్చెనా యిత డహంకృతి రూపము సత్తలేదుగా!"

అనువారు "ఇతడటయ్యా రెడ్లకవిరాజు
డిండిమభట్టు నోడించు చిన్న
యొక్కటియు గనరాకున్నది వేషము
దక్క లేదేమొ వాదనకు శక్తి"
యనువారునై ప్రజలంతంత పొంది చూ
చెడువారునై వెంట నడచుచుండ
విద్యానగరరాజవీథుల సిసుక చ
ల్లిన నేలపైన రాలినది లేక
శారదాంఘ్రిద్వయార్చనాంభోరుహంబు
వికసితంబైన మనసులో వేవెలుంగు

తేజములు నిండిపోయి మదేభగామి
ఆంధ్రకవిరాజు శ్రీనాథు డరుగుచుండె.

"ఆగమంబుల నిధియైన విప్రుడు, తల
నేదయ్యా జుట్టు గోష్పాదమంత?
శైవమతాచారసారాధ్వగుం డట
కనరాదు పో లింగకాయ మెడను!
కవిరాజ బిరుదశంఖస్వన ప్రేరితు
డా మంత్రివేష మెట్లావహించె?
శారదోపాసనాధార దిగ్గజుడంట
పెట్టలేదు ముఖాన బొట్టుగాని!
ఈ విరుద్ధప్రవృత్తి తా నెటు జయించు
ద్రవిడ ధాత్రి మహావాణి తాండవించు
గాఢ డిండిమఋషి?" నని, "చూడవలెన
ఈవిచిత్రంబు" నని ప్రజ లేగుచుండ్రి.

తన వెంట వచ్చు శిష్యుని గాంచి నవ్వెను
ఈ ప్రజ యూహా గ్రహించినట్లు;

తన వైరిదైనవాదన నూహచేయును
తనలోన తానె వాదనల పెంచి;
తనక విజయదీక్ష ననుభవించిన పూర్వ
విషయస్మృతుల నిష్ఠ వెరగుపడును;
తనగెల్పులోన పొంగును రెడ్డిరాజుల
ఆదరణాంభోధి యనుచు మరియు
దైవవశమున నోటమి తనకు కల్గు
నేమొ యను కించ కించిత్తు నెరుగబోని
తెలుగుకవిరాజు రాయల కొలువునందు
చరణమును మోపె, సభయు నిశ్శబ్ద మపుడు.

"డిండిమభట్టు కీర్తిని గడించుటలో ముదితేరినాడు త
త్పాండితి దక్షిణాపథవిభావరి వెన్నెల లారవోసె, మా
ర్తాండుని తేజ ముట్టిపడు తన్ముఖమండల; మామహాత్మ్యపై
దండుకు వచ్చినాడు ఫలితం బనుభూతము కాదెవీనికిన్."

అని మనసులోన తలపోయు నవనిపతిని
దక్షిణకరంబు పైకెత్తి దంతదీప్తు

లావరింప మహాసభ నాకవీంద్రు
డాశుధారల నాశీస్సు లాడినాడు.

"పంపావిరూపాక్ష బహుజటాజూటి కా
రగ్వధ ప్రసవ సౌరభ్యములకు
తుంగభద్రా సముత్తుంగ వీచీఘటా
గంభీర ఘుమఘుమారంభములకు
పూర్వాంధ్ర రాజ్య సంపూర్ణ శౌర్యానల
ప్రత్యక్షపుణ్య ప్రభావములకు
హిందూమతోద్ధారణేందూదయవికాస
చాలితాధ్యాత్మ ప్రచారములకు

గాఢ డిండిమభట్టు దా కంచుఢక్క
మోది పగిలించు సర్వవాగ్వాదనలకు
మనసుపడి ప్రౌఢరాయలమందిరమున
నడుగుపెట్టిన కవిరాజు నయ్యనేను.

"వచియింతు వేములవాడ భీమనభంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు,

భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు,
పలికింతు తిక్కయజ్వ ప్రకారము రసా
భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని రేవ
సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు
వ్యాసమునివోలి, వాల్మీకి వాక్కువోలి,
కాళిదాసునివలె, హర్షకవినివోలి,
ప్రతిపదరసోదయంబు నాపలుకు తెలుగు
నాయకా! నన్ను ప్రజలు శ్రీనాథు డంద్రు.

"వేదార్థంబులవాదమో, కవితలో వీణాశ్రుతుల్ నించుటో,
లేదా తర్కమొ, నీతిసూత్రముల నాలింతో, మరేదో వృథా
గాదా కాలము నూరకున్న సెలవీగా వేడెదన్ డిండిముం
డేదన్నన్ సరి సిద్ధమే పగులవేయింతున్ ప్రభూ! ఢక్కలన్."

"గౌతమీనది పొర్లి గారవించినదయ్య
రాణ్మహేంద్రమున నా రాగము విని;

వేగీమహావీథి వెదజల్లినారయ్య
ముత్తైదువులు చూపుము త్రియముల;
బంగారుపళ్ళెము బంతిభోజ్యంబులో
విన్నన్నమంత్రి సేవించినాడు
నన్ను; స్వీయచరిత్ర నెన్నుకోరాదయ్య
క్రొత్తవాడనుగాన కొంతచెప్ప
వలసె"నను కవినంకకు తెలుగురేడు
చూచె. డిండిమభట్టును చూచె, తిరిగి
రణమువాక్కులలో విజృంభణము పెరిగె
గ్రుక్కత్రిప్పుకో వీలులేకుండె సభకు.

"వేదాలుతలక్రిందు వెలిగించినాడంట
మాఱైనరాద యీమాటకేల?
తర్కశాస్త్రాంబోధి తరియించినాడంట
యీయుక్తికి జవాబు నీయడేల?
కవితలో వాణిరెక్కలు కట్టినాడంట
అతని ధారాశుద్ధి కందడేల?

పాతంజలంబు సంప త్తి వీని దెయుంట
సూత్ర విరుద్ధ మిచ్చు నదియేల?
డిండిముడు పూర్వరూపము డించినాడో,
కాక పుంభావవాణిగా కవి యితండు
పుట్టెనో భూమిపై" నని పొగడుసభ్యు
లా వివాదంబు పదపద మందుకొనుచు.

వాగర్థంబులలో ప్రమాణములలో వాదంబులో సూత్రచ
ర్చాగాంభీర్యములో కవిత్వమధుధారావేగ విభ్రాంతిలో
"బాగోయీ కవిరాజ! యింతటి ప్రభావంబున్నదం చెంచలే
దే గర్వంబునుకొన్న నీపలుకు లన్నీ సత్యమున్ జేసితో."

అనిరి పండిత సభ్యు లందంద లేచి
జయజయార్భటులందు వర్చస్సు డింది
పాలిపోయిన డిండిమభట్టుబిరుద
కంకణములెల్ల తెగగొట్టగా నృపుండు

అనుమతి నిచ్చె డిండిము డహంకృతి చచ్చిన సాధుపండితుం
డనియెడిరీతిగా నిలిచి యాసభలో పలికెన్, "ప్రశస్తవ

_ర్తనులు జయాజయంబులవిధంబు గణింపరు నన్ను గెల్చినా
డని యని కించ లేదు వినయాధికుడన్ కవిసార్వభౌమునిన్

నన్ను మించిన వానిగా నెన్నుకొందు,
బిరుదములుతీసివేతును, భేరి నిచట
పగులగొట్టింతు''నని చెప్పి బయటికరిగె
విజయఘోషలు సభలోన వెల్లివిరిసె.

''జయ కవిరాజ నీవిజయశాసనముల్ లిఖియింతు నాంధ్ర వా
ఙ్మయచరిత్ర సువర్ణఫలకంబులపై, నిను బట్టి నాకు ను
న్నయది తెలుంగు సంస్కృతి యనారత''మంచువచించుచుం కర
ద్వయమునుమోడ్చి డిండిముడు వచ్చెనులోనికికంచుఢక్కతోన్

అది పగిలించినారు వలయంబులునై విరళీకృతంబులై
కదలెను శబ్దముల్ తెలుగుకావ్యసరస్వతి నూపురంబు మ్రో
యు దినము లింకనున్న వనుచుండిరి సభ్యులు; రాయలున్ సభా
సదులనుచూచిపల్కెను ప్రశాంతవచస్కుడమోఘువాక్కులన్.

''ఏనాటిదో ఢక్క యిపుడు ముక్కలుగాను
పగిలిపోయెను చింతపడ డితండు;

ఎట్టిగంభీరుడో యిట్టిగెల్పులు పొంది
కవిరాజు మాట నొక్కటియు ననడు;
ఇరువురును సమర్థులే శక్తియో రెండు
మూర్తులు దాల్చెకాబోలు; లేక
ఇట్టిమహాప్రజ్ఞ లెచట వింటిమి గాంచి
ధన్యులమైనాము తలచుకొలది;
విస్మయముగొల్పు కథను జూపించినారు,
మీ కవిత్వప్రశంసలో నాకుగూడ
స్థానము నొసంగినారు వాఙ్మయచరిత్ర
ప్రౌఢరాయలసభ పేరు పలుకుగాన.

ఇరువురు గౌరవార్హులె జయించినవారలు గొంత యెక్కువో
దురుగద నా బహుకృతులతో పనిలే దకలంకమూర్తులౌ
గురులకు గాని యీమనుజకోటి స్వభావము మార్చుకోదు దు
ర్భరముగ దెప్పిపోయును ప్రపంచకవైఖరులెల్ల చిత్రముల్.

కాన సంభావనకై యిచ్చుతృణమేని
మేరువుగా నెంచగోరినాను
కవులార! యనిరాజు గద్దెపై నాసీను

డయ్యో భటుల్ విచిత్రాభరణము
లంబరంబులు కాన్క లమితముల్ గొనితెచ్చి
నృపవరాళి యాజ్ఞాపరీక్షకులయి
నిలిచియున్నారు; సభ్యులు రాయ లింతగా
నొప్పబల్కనె యని యుబ్బిపోయి
నృపు డెవరి నెట్లుగా సత్కరించునో యని
గ్రుక్కిళులు మ్రింగుకొనుచును గూరుచుండ్రి,
నవ్యకవితా సనాథ శ్రీనాథసుకవి
యూహాలంభోధివీచులై యూగుచుండె.

"పదిపదినాళ్లు శాస్త్రముల పారము ముట్టిననన్ను ధక్కతో
నడిమినమేటి కర్హ్వామగునట్టి బహూకృతి యీమహాసభా
సదనములోన పండితులసన్నిధి బంగరుగద్దెమీఁద చే
యుదె కనకాభిషేకము ప్రభూత్తమ! డిండిమగర్వహారికిన్."

అని వచియించె డిండిము డయత్నముగా; సభలోన పైడి గ
ద్దెఁ గిలిపి హేమటంకముల దెచ్చిరి రాసులు పోసినారు రా;
జును తనగద్దె డిగ్గి పిలుచున్ కవిరాజును కేలుపట్టి లే;
చెను పరిపూర్ణహర్ష వివశీకృతుడై కవిరాజపూజకై.

బంగారుకొండపై పరమనిష్ఠాగరి
ష్ఠుండైన శివమూర్తి శోభదోప
శ్రీనాథకవిరాజు చిరునవ్వుతో హేమ
సింహాసనమున నాసీనుడయ్యె;
పార్శ్వాల డిండిమభట్టు రాయలు నిల్చి
దోసిళ్ళతో నెత్తి రాసిలోని
పైడిటంకంబుల పై పోయుచుండిరి
సభ్యులు పనసలు చదువుచుండ్రి;
ఏమహారాజుపొందని యీయపూర్వ
గౌరవంబున శ్రీనాథకవి మునింగి
విజయనగర సామ్రాజ్యము విస్తరిల్లు
ప్రార్థనలలోన తన భావఫణితి నిలిపి.

"దీనారటంకాల తీర్థమాడించితే
దక్షిణాధీశుముత్యాలశాల?
పగులగొట్టించితే భయదవాదప్రౌఢి
గౌడడిండిమభట్టు కంచుఢక్క?
విహారింపజేసితే వీరభద్రారెడ్డి

# నవనీతము

విద్వాంసుయశము దిగ్విఘులందు?
పలికింపజేసితే బహుళాంధ్ర జనసభా
భాస్వరుఁడనుచు ప్రపంచకంబు?
మందర మహీధరాధరమథ్యమాన
దుగ్ధపాథోధిలహరికోద్భూతమైన
లలితసాహిత్యసౌహిత్యలక్ష్మి నొసగి
సరససద్గుణనికురుంబ శారదాంబ!

తెలుగుప్రజల్ ధరిత్రి రవితేజము వెల్గిననాళ్లు సంపదల్
కలిగినవారునై సుఖముగా వసియించెడివారునై మహా
త్ములు స్తుతియించువారునయిపొందుదురమ్మస్వతంత్రతన్ భవ
ద్బలమున నంచు దీవనల పల్కుచు లేచె సువర్ణతేజుడై.

విజయనగరాంధ్రలోక మావేళ కవిత
కన్న కానుపు ముత్యాల కాంతులందు
తెలుగుభాషాసరస్వతి విలుచుకొనియె
పైడిటంకాల కట్టులతోడినగలు.

కొడాలి సుబ్బారావు

# భిక్షువు

అస్తమయ మగుచుండె, హర్మ్యాగ్ర వీధి
శాంతి విహరించు నర్మదకుంతలములు
వృద్ధభానుని కిరణసమృద్ధి గాంచి
స్వర్ణతోయ ప్రవాహ విభ్రమము గొలిపె.

చంద్రకాంతోపల స్నిగ్ధ చారువేది
హంసతూలిక పాన్పున నధివసించి
ప్రాంత కేళీ నవోద్యాన పరభృతముల
గీతికలకు విపంచి నేకీభవించి—

పార్శ్వతలమున భూషితబర్హి యొకటి
పింఛమును విస్తరించి కేవిని నటింప
విరహ వేదనాభర రసోద్వృత్తి నింపు
పాట లయ్యెడ నర్మద పాడుచుండె.

కాని వాద్యమునందు లక్ష్యమ్ము లేదు
భావము విలీనమై లేదు పాటయందు

దృష్టు లన్నియు రాజవీథికిని ద్రిప్పి
యెదురుచూచుచునుండె సతీశురాక.

ఆమెకు సతీశు డొక మేనమామకొడుకు
మానవంతుడు మహితనిర్మలయశుండు
వారి కన్యోన్యబద్ధమై ప్రణయవల్లి
నాటుకొనియుండె గడుపిన్ననాటనుండె.

ఐన, విధి చూచి యోర్వలేదాయెనేమొ
మంచితరుణము వచ్చి పుష్పించుచున్న
ప్రేమవల్లిక నదయుడై త్రెంపివైచె;
నర్మద సతీశు బాసె గంటతడితోడ:

హాయి విహరింప మేలు హర్మ్యములు గలవు
పూన నున్నవి నవరత్న భూషణములు
కాలు క్రిందానకుండ దాసీలు గలరు
కాని, యాతడు లేక సుఖమ్ము లేదు!

ఇదిగొవచ్చు మనోహరుం డదిగొవచ్చు
బహుళతర తామసమున భాస్వన్మయూఖ

రేఖవలెవచ్చు దనదుకోరికలు దీర్చు
ననుచు బ్రత్యహ మాసల మునుగు నామె.

అన్యునకు జెల్లి నేటి కేడాదియాయె
నిప్పటికి నాతడీవైపు ఱెప్పవిప్పి
తొంగిచూడఁడు హేతువు తోపరాదు
వార్తయైనను దెలియ దావంకనుండి.

"భాగ్యమదమున మాపూర్వ పరిచయమ్ము
విస్మరించితి ననుచు భావించెనేమొ
ఇగురుటాకుల విడని కోయిలను బోలి
వెంటనంటెడు వా డేల పీడె నేడు!"

పటుతరోద్వేలమయి పాఱు ప్రబలమోహ
తోయమందు వివేకమ్ము తూలిపోయె.
ఆత్మ శారీరకానంద మరసెగాని
ధవునియోగ్యత నావంత దలపదామె!

ఆంతరంగిక దాసిచే నంపినట్టి
వార్త వినిన సతీశుండు వచ్చుననుచు

దృష్టు లరమోడ్చి రాజవీథిని నిగిడ్చి
మెల్ల మెల్లన వీణియ మీటుచుండె.

అరుణరాగము మాసె విహాయసమున
గైరవాప్త వియోగాగ్ని గ్రాగిపోయి
నేలవ్రాలిన యామిని మేలిముసుగు
కొంగు తొలగించి యల్లన తొంగిచూచె.

ఉదయశిఖరిని గ్రమ్మె బయోధరములు
చంద్రు డింకను వికసించు జాడ లేదు
విహగసంతాన రుతములు వీగి పోయె
నంధకార మయం బయ్యె నఖిలజగము.

ఆసమయమందు నారాయణా యటంచు
భిక్షువొక్కరు డరుదెంచె వీథివెంట
"పూర్వపరిచిత కంఠమువోలె దోచు
పిలువు పిలువు సరోజినీ, పిలువు మతని!"

మేఘమండలమున నుండి మేడపైకి
జంద్రికాకాండ మొకటి చంచలత బడియె

అగ్రమున నిల్చియున్న సన్యాసి జూచి
యతివ సర్వాంగములు ఝల్లురని చలించె.

భిక్షుకుం డెంతకును నోరు విప్పలేదు.
నర్మద యొకింత యెట్లో డెందము కుదిర్చి
అంగుళుల గొంగు మెలివేయు చనియె నిట్లు
రాగ మిగురొత్త జలిత స్వరమ్ముతోడ:

"రాత్రి పడిన తర్వాత నీరాజవీధి
నెందు బోవుచునున్నాడ? వెవరు నీవు?
ఏమిగతి యిట్టిసన్యాస మిచ్చగింప?
నడ్డగించెడి ప్రేయసియైన లేదో?"

"భువిని గలయట్టి సర్వవస్తువుల విడిచి
దండము ధరించుకొను జడదారి నేను
రాత్రియేమి దివం బేమి రాజమార్గ
మేమిటి శ్మశానవాటిక యేమి నాకు?

"కులము చెడెనంచు ఘోషింప గురుడు లేదు
తనయుగతి జూచి దురపిల్ల దల్లి లేదు

గోలు గోలున నేడ్వ సిల్లాలు లేదు
ఒక్క చుట్టము లేదు నేనొక్కరుడనె!

"కోరితి నపూర్వ ఫల మొండు గోసికొనగ
నంతలో నెవ్వడో దాని నపహరించె
పోదు నింతట నర్మదా పుణ్యతీర
మంజు లారణ్యసీమ నెమ్మది వసింప!"

అనిన దల వాంచి చలిత హస్తాంగుళులను
నెమిలితల దువ్వుచు నొకింత నిలిచియామె
బాష్పలులితము ప్రణయ విహ్వాలమునైన
దృష్టి సారించి భిక్షువు కిట్టు లనియె.

"నీవు కోరిన ఫలమును నీవ కాక
యనుభవించునె పరు డది యపహరించి?
నీకుగా నిల్చియుండె మన్నింపు మీవె
నర్మదాతీర మిట జేరినావా లేదా?

"పాదముల వ్రాలి యొనరింతు ప్రార్థనమ్ము
తేరిచూడు సతీశ, యీ దీనురాలి!

గ్రీష్మపరితాప తప్తనికృష్టమైన
నిర్ఝరిణివోలె ఘనురాకనే స్మరింతు!"

అనిన నడ్డమువచ్చి సన్న్యాసి పలికె:
"ఏను భిక్షుకుడ, సతీశు డెవ్వ డిచట?
అతడు గతియించి వత్సరమాయె, నిపుడు
వానినామము స్మరియించు వారు గలరె?

"అవనిలోపల గల జవరాండ్రలోన
నెవ్వతె పవిత్రురాలని యెంచె నట్టి
వనిత యెప్పుడు పతి కవిశ్వాసిని యయె
నప్పుడె సతీశు డీయాత్మ నంతరించె.

చంద్రబింబము మేఘసంఛన్నమయ్యె
వెనుదిరిగి చూడక ప్రశాంత మనముతోడ
హర్మ్యసోపానముల డిగి యంధకార
మండలమ్మున భిక్షువు మాయమయ్యె!

కొడవటిగంటి వెంకటసుబ్బయ్య

# నవనీతము

లే! యింకన్ నిదురించుటేమిటిర లే! లే చిట్టినాతండ్రి! కృ
ష్ణా! యన్నాయి కళిందజాపులినదేశక్రీడనార్థమ్ము న
ష్టే యేగెన్ మఱి నీవుకూడ జనవా వేగమ్ము లేవయ్య తం
డ్రీ! యాదిత్యనవాంశువుల్ పసపుపండించెన్ గవాక్షమ్మునన్

ప్రక్కయంతయు జిమ్మితి పద్మనాభ
అన్న చూడుము పుస్తకమ్ముల్లు పండు
కొనును నీవేమొ ప్రక్కంత క్రుమ్మి క్రుమ్మి
ప్రక్కయటులుండ నీ విట్లు పండుకొందు

మొగము కడిగెదనుతే సం
పెగరెక్కనుబోలె రెప్ప విప్పుము నునిచి
ర్నగవు పసరుమొగ్గవలెన్
దొగరుపెదవిమీద వచ్చి దోబూచాడున్

ఇదిగో తండ్రికి జట్టి నవ్వుదయమయ్యెన్ లే! యదూత్తంస! నీ
వోదుగన్ బోవని సందుసందులకునై యూరెల్లదా నేడ్చెడున్

గద నీయల్లరిలేక గజ్జియలు ఘల్ఘల్గా గృహమ్మెల్ల ద్రో
క్కదునాట్యమ్ములలేవవయ్య ప్రభువా! కృష్ణా! యశోదాత్మజా!

పొలపొల కన్నువిప్పి మఱిమూసెదు చిట్టికి నిక్కమాడు చ
క్కిలిగిలి యున్నదా? కలదు కేలును జంకకు హత్తుకొంచు న
వ్వుల చిఱువెల్గులో బెదవి పొందె నుషోనవరేఖ తిగ్గి య
వ్వనిమొగమ్మై ముద్దుంచుకొని పండెద వల్లరికాదు లెమ్మురా

తఱకలుకట్టగా బెరుగు ద్రచ్చినకవ్వపుమ్రోత నిద్రలే
చి రురుశిశుంబలెన్ నెగదిచిందులు త్రొక్కెదు ప్రొద్దదెక్కె యుఃక్
సరి నునుసెజ్జ వీడవు పసందులబిడ్డవు నేడు తండ్రి యి
క్షురసము నీకునై యెదురుచూచెడు మీగడతోడ వెన్నతోన్.

చాలు నిక నిద్రలెమ్ము కృష్ణయ్య లెమ్ము
లేతక్రోతులై పండ్లిగిలించుకొంచు
నక్కి నిను తొంగికనుగొంచు నన్నుజూచి
పరువులిడెదరు నీదుసావాసగాండ్రు

ప్రిదులనిచంద్రవంక సవరించెద రత్నపురావిరేక పై
గుదురుగ నిల్పుదాన జడకుప్పెలు వేసెద జుత్తు దువ్వి యీ

నిదురనుమాని పైడిబరణింబలె మెల్లగ లేచిరమ్మ నా
యెదగలయింద్రనీలమణియేడిర యల్లదె మెల్లలేచెదున్.

ఒయ్యారమ్ముల నిద్ర కాని నిదు రేలోయీ యశోదాశిశూ!
కయ్యమ్ముల్ మిగిలెన్ విచిత్రశిశువా! గ్రామమ్మునందెల్ల నో
యయ్యా! కోపమువద్దులే యననులే ఔ పైడిఖిల్లావులే
సయ్యాటమ్ముగ నంటిలే యదుకులస్వామీ! రమావల్లభా!

అయ్యా నిద్దురలేచెనా యంచు నడిగె
నందగోపుడు మీయయ్య సుందరాంగ
కోసలు ప్రక్కలబడి పులిగోరు నలిగి
పోవుచున్నది లేవరా బుచ్చితండ్రి!

అచ్చపువేల్పుబువ్వ బుడగ్గై తరగ్గై గరుడాళువారిపై
వచ్చెదు చిట్టికోసమని వాకిటనున్నది యెవ్వరోయి వే
బుచ్చుకొనుండు దాని జిలుపొంగులనవ్వులకన్నుదమ్ములన్
విచ్చుచునున్నవాడు యదువీరుడు బుగ్గగులాబిమొగ్గగాన్

చిమ్ములదూడవంక నెగజిమ్మెదు కోరలకన్నుదోయితో
గుమ్మమువద్దనున్నదదిగో కను నీకయి గుమ్మపాలగో

వమ్మ మ జీవు త్రాగకయ యూ తనదూడనుగూడ ద్రావనీ
దమ్మ మ జింక లే నురుసులారకమున్నగ ద్రావగావలెన్

అనగ ననగ నొక్క యబ్బాయి యున్నాడు
లిప్తలోన నిద్ర లేచునంట
కన్నువిప్పువఱకు గంటసే పనుకొమ్మ
కన్నువిప్పుపైని గంటసేపు

దిం డిది మంచ బుద్ధి తెగద్రెంచుకలేవవలెన్ సుమండి లే
దండి యిదేగతిన్ మసలినంతటిసేపును బద్ధకంబు పో
దండి! జగమ్ము మీకొఱకు ద్వారమునొద్దనె వేచియుండె లే
వండి! యదూద్వహా! విసువువచ్చెను ప్రాణము తల్లిగారికిన్

ఎత్తటి తెల్లవారి నిదురించరు మాదగుకోవలోన మా
మొత్తముమీాద నెవ్వరును బోలిక యింటనె యున్నదేకదా
మెత్తగ పండుకో నిదురమేల్కొనగా దగదయ్య! అయ్య! మే
నత్తలచాలి కందురుగదా! నిజమే! యదువంశమండనా!

ఈయెనవ్వులలో జనని యెంతటికోపముపోవునంచు నీ
లేయెదలో నెఱుంగుదువు లే! పసిదొంగ! మరింక జాలు లే

రోయి బడాయి! లేవగదవోయి! ననుం గడుపారకన్న తం
డ్రీ! యదువృద్ధలోచనమణిచ్ఛవిభూతశరీరవల్లరీ!

ఇంక నిద్దురలేవ వీ వెళ్లుకాని
నెలలతరబడి నీబిడ్డ నిద్రపోవు
మర్వియెల్ల జాతుర్మాస్య లుండవచ్చు
నని జగంబున జాటింతునయ్య? కొడుక!

ఇక జాలు లేవవోయీ
యొకకోలికికి దెత్తుగాని యూరెల్లను నీ
వొకవేల్పువులే మాపా
లికి స్వామీ! లేవవయ్య లేవయ్య ప్రభూ!

వెనుకత్రిప్పు చేతులను గుప్పిళ్ళుపట్టి
కనులుతుడుచుచుంటివి మణికట్లతోడ
నిక్కి నీల్గుచు నుంటివి నిద్ర యింక
నయ్యెనని యనుకొమ్మందువా! ముకుంద!

ఇది యేదోకథవోలె నున్నయది మీకీరాత్రియెల్లఁ బ్రభూ
యదువంశాంబుధిచంద్ర! నిద్ర యది లేనట్లున్నదే తెలుగా

అదియున్ గొంచెముసేపులోన గడు పేదయ్యా బలే నిండియు
న్నదియే యుట్లవియేమియేన్ మిగిలెనా! నందార్భకా! యూరిలో

ఇదియా నిను గనవచ్చిన
యదపుచెడినకుఱ్ఱకుంక లందఱికన్నుల్
చెదరిన మందారమ్ములు
చిదిపిన కఱ్ఱెఱ్ఱకావి చిమ్ముచునుండెన్

మతికరిబుద్ధు లెంతకును మానవు నిన్నునుబట్టి యాప బ్ర
హ్మాతరముకాదు నాకడుపునం దెటు పుట్టితివోయి చాలు నా
మెతకతనమ్ముగాక పుడమిన్ నినువంటికుమారు లుందురే
యతివగయాళిమూక యిప్పుడె పడిపోవును వచ్చి నాపయిన్.

గొల్లలగూడెముల్ తడకగొంపలు తల్పులులేవు నీవు వ్రే
పల్లెకు మేటివైతి వొక పాతికక్రొతులు నీకుదోడు మీ
రెల్లరు నట్ల కెక్కుపనికేమొ హుజూర్సరదారువైతి రీ
పిల్లలతోడ నింక గనుపింపుము యింకొకమాఱు చెప్పెదన్.

పాయకరాత్రులన్ గదలవద్దనిచెప్పినమాట గాలికిం
బోయెను జాలుచాలు నటువో బురుగుండును బుట్రయుండునో

యికగాళియున్ దలచ ే నిపుడైనను నాయదృష్ట మ
ౕ! యలకోటిదేవతలు నాడు నినున్ బ్రతికించి యీాయరే

తముకూడ సామ్మసిలు చీకటిలోపల నల్ల దొంగ వే
ని గానిపింతువు దరిద్రులకున్ నిదురించువేళ నీ
తరుణమ్ము వేచికొని యందఱవెన్నలు దొంగిలింతు నీ
తము సుంతయున్ గుణము చెందదురా నవనీతలుబ్ధుడా!

నయింట బాలు లేవో
నయింటను బెరుగు లేదో తా నేమిటికో
వనజాక్షు డూరిపై జని
ని యాగీ లింటిపైకి దెచ్చును చెపుమా!

ఎవడురా వాడు మొన్న దా నేమొవచ్చి
యయ్యొ యావతారపురుషుడటంచు జెప్పె
నిపుడు వచ్చిన దెలియుగదే నిశా ప్ర
ళయశిశున్ నిన్నెఱుంగు వేళకును లేదు

చెప్పి చెప్పి నాగొంతుక నొప్పివెట్టె
గొన్ని పెరుగులు నిశి దోడుకొనును గొనవు

ేడుకొనుచున్న పెరుగులు దోచెదేని
ాడుకొనుచున్న కాపురాల్ కూలిపోవు

మొగము నల్లువెట్టెదు
్వమీ నామాట గిట్టుబడికా లేదా?
మెతలు మఱగువారికి
ామెత లేమిటికి వట్టి చాదస్తమ్ముల్

ంణుకుణుకుణుకుణుక్వణనమ్ము లొనరింప
ివ్వించు బంగరుమువ్వలగమి
ణకిణకిణకిణస్వనములు వెలయింప
ిలుగు రత్నాల గజ్జియలపేట
ఘణఘణఘణఘణధ్వనులు పంచారింప
నెటెనగిషీలయందియలజంట
ధణధణధణధణ ధ్వానమ్ము లొలయింప
గలుపు కేడ్డతహారాన్ను గంటలవడి
యదుకులోద్యాన కేకి నాట్యమ్ము చేసె
నందగర్భసరోహంస నడలు నెఱపె
నెమ్మి నాట్యమాడెను యశోదమ్మకొడుకు
అంచనడకలునడచె క్రిష్ణమ్మగారు.

విశ్వనాథ సత్యనారాయణ